



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 148 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 2 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :148 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 2 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




# రూ.53.5 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

- 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.53.5 లక్షల కోట్ల బడ్జెట్
- మూలధన వ్యయాన్ని రూ.12.2 లక్షల కోట్లకు పెంచిన కేంద్ర ప్రభుత్వం
- బయోఫార్మా, ఎంఎస్ఎంఈ రంగాలకు చెరో రూ.10,000 కోట్ల నిధులు
- వ్యక్తిగత అవసరాల దిగుమతులపై కస్టమ్స్ సుంకం 10 శాతానికి తగ్గింపు
- ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం



**రెవెన్యూ వసూళ్లలో 35,33,150 కోట్లు**
**మూలధన వసూళ్లలో 18,14,165 కోట్లు**

## కేంద్ర బడ్జెట్ ఎఫెక్ట్: ధరలు పెరిగేవి, తగ్గేవి

- కొన్ని రకాల ఔషధాలు, ఈవీ బ్యాటరీలు, మొబైల్స్, ట్యాబ్లెట్స్ ధరల్లో తగ్గుదల
- విదేశీ విద్య, వైద్యపరికరాలపై తగ్గనున్న భారం
- పెరగనున్న సిగరెట్, లగ్జరీ వాచ్ లు, విదేశీ మద్యం ధరలు

- మిగతా2లో

## హైదరాబాద్ 3 హైస్పీడ్ రైళ్లు!

- ఏపీ సహా 4 రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ కోసం పథకం, హైదరాబాద్ సహా ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు
- సహజ వనరులన్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహకం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడి
- మౌలిక సదుపాయాల కల్పనకు రూ.12.2 లక్షల కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ సహా వివిధ నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లు




## ఏపీ అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ ఒక వరం...
# ఇది ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్



- హైస్పీడ్ రైల్ కారిడార్లు, డేటా సెంటర్ల ఏర్పాటు రాష్ట్రానికి మేలు చేస్తుందని వెల్లడి
- టెక్నాలజీ, పరిశ్రమలు, పర్యాటక రంగాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత లభించిందన్న సీఎం
- రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు కేంద్ర బడ్జెట్ సహకరించేలా ఉందని హర్షం
- 2047 నాటి వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ ఉందని ప్రశంస

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 'ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఈ బడ్జెట్‌ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. కుప్పంలో ఆయన కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ, ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉందని, అభివృద్ధి ప్రణాళికలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు

- మిగతా2లో

## బడ్జెట్ లో ఏపీకి వచ్చింది
# గుండు సున్నా

- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శ
- ఎన్డీయేలో చంద్రబాబు కీలక పాత్రలో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరలేదని ఆరోపణ
- అమరావతికి నిధులు ఇవ్వకుండా అప్పులు అంటగట్టడం దుర్మార్గమని వ్యాఖ్య



- పోలవరం ప్రాజెక్టుకు నిధులు తగ్గించి, ఎత్తు తగ్గించే కుట్ర చేస్తున్నారని ఫైర్

విభజన హామీలు, ప్రత్యేక హోదాను కేంద్రం పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం

- మిగతా2లో

## మాజీ మంత్రి జోగి రమేష్
# ఇంటికి నిప్పు...
## రాళ్లు కర్రలతో టీడీపీ కార్యకర్తల దాడి



- ఇబ్రహీంపట్నంలో హైటెన్షన్.. జోగి రమేశ్ ఇంటికి నిప్పు
- మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై టీడీపీ కార్యకర్తల దాడి
- విజయవాడ ఇబ్రహీంపట్నంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం
- నివాసానికి నిప్పు పెట్టి, ఫ్లెక్సీలను తగులబెట్టిన ఆందోళనకారులు
- చంద్రబాబు, లోకేశ్‌పై వ్యాఖ్యలకు నిరసనగా ఈ ఘటన
- భారీగా మోహరించిన పోలీసులు, పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం

- మిగతా2లో

పెన్ పవర్ డెస్క్:విజయవాడ సమీపంలోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ నివాసాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ముట్టడించాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భయానక వాతావరణం ఏర్పడింది. టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌పై జోగి రమేశ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ టీడీపీ



## టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ... రవిచంద్రకు బాధ్యతలు

- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌పై బదిలీ వేటు
- సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్రకు అదనపు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

- మిగతా2లో

## అమెరికాతో యుద్ధం కోరుకోవడం లేదు



పెన్ పవర్ డెస్క్:ఇరాన్– అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతు న్నాయి. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశంలోని

- మిగతా2లో

## కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల ఫైర్..
# వాస్తవాలను విస్మరించారన్న రాహుల్




- నిరుద్యోగం, రైతుల కష్టాలను ప్రభుత్వం విస్మరించిందని రాహుల్ ఆరోపణ
- స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమన్న అఖిలేశ్ యాదవ్
- ఇది కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని విమర్శ
- మధ్యతరగతి, రైతులు, కార్మికులకు తీవ్ర నిరాశే మిగిలిందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌పై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ

- మిగతా2లో

## పనిచేసే వారికి పట్టం.. మారకుంటే నమస్కారం..
### కుప్పం నుంచి చంద్రబాబు స్ట్రాంగ్ మెసేజ్!

- కుప్పంలో కార్యకర్తలతో చంద్రబాబు సమావేశం
- నిజంగా కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని భరోసా
- పనితీరు బాగోకపోతే నిర్మొహమాటంగా పక్కన పెడతానని హెచ్చరిక
- కుప్పం మోడల్‌నే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- ఒకే సీజన్‌లో కుప్పానికి హంద్రీ-నీవా జలాలు తెచ్చామని వెల్లడి
- రాయలసీమను రతనాల సీమగా మార్చి చూపించామని వ్యాఖ్య

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# చేతులు కాలాక.. అంబటి పశ్చాత్తాపం.. ఇప్పుడేం లాభం?

రాజకీయాల్లో మాట ఒక పదునైన ఆయుధం. దాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వాడితే గౌరవం.. వ్యక్తిగత దూషణలకు ఉపయోగిస్తే అగౌరవం దక్కుతాయి. తాజాగా వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యవహారశైలిని గమనిస్తే.. "చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం" అనే సామెత అక్షరాలా వర్తిస్తుందనిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై చేసిన వ్యాఖ్యల విషయంలో ఆయన వ్యక్తం చేస్తున్న 'పశ్చాత్తాపం' వెనుక నైతిక బాధ్యత ఉందా లేక కేవలం రాజకీయ రక్షణ ఉందా అన్నది చర్చనీయాంశంగా మారింది.

**మాటల పదును.. మర్యాద హద్దులు**

ప్రజాస్వామ్యంలో విమర్శ అనేది అభివృద్ధికి సోపానం కావాలి. కానీ దురదృష్టవశాత్తూ నేటి రాజకీయాల్లో విమర్శలు వ్యక్తిగత దూషణలుగా.. అసభ్యకర వ్యాఖ్యలుగా రూపాంతరం చెందుతున్నాయి. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తిపై మాట్లాడేటప్పుడు కనీస మర్యాద పాటించకపోవడం ప్రజాప్రతినిధుల సంస్కారానికే ప్రశ్నార్థకంగా మారుతుంది. తప్పు జరిగిపోయిన తర్వాత "అలా అనకుండా ఉండాల్సింది" అని చెప్పడం బాధ్యత నుంచి తప్పించుకోవడమే తప్ప, తప్పును సరిదిద్దుకోవడం కాదు.

**పశ్చాత్తాపమా? ఆత్మరక్షణనా?**

టీడీపీ కార్యకర్తలపై చేసిన వ్యాఖ్యలు తప్పేనని అంగీకరిస్తూనే మరోవైపు "అరెస్టులకు భయపడను", "చట్టం నాకు తెలుసు" అంటూ న్యాయపరమైన ధైర్యాన్ని ప్రదర్శించడం చూస్తుంటే.. అక్కడ అంబటి రాంబాబు పశ్చాత్తాపం కంటే ఆత్మరక్షణే ఎక్కువగా కనిపిస్తోంది. నిజమైన పశ్చాత్తాపం వ్యక్తిగత అహంకారాన్ని తగ్గించాలి.. కానీ అంబటి మాటల్లో ఆ సంకేతాలు మృగ్యమయ్యాయి. పోలీసుల చర్యలను తప్పుబట్టడం, అధికార పార్టీ నేతల పేర్లను ప్రస్తావించడం ద్వారా ఉద్రిక్తతలను తగ్గించడానికి బదులు, రాజకీయ సెగను మరింత రాజేసే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

**ప్రజాస్వామ్యానికి నష్టం**

రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలు కేవలం వారి వ్యక్తిగతమైనవి కావు. అవి సమాజంపై, ముఖ్యంగా కేడర్లపై తీవ్ర ప్రభావం చూపుతాయి. నేతలు హద్దులు దాటితే కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి ఘర్షణలకు దిగుతారు. ఇది అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు తమ మాటలకు కట్టుబడి ఉండాలి. తప్పు జరిగినప్పుడు సాకులు వెతకడం కంటే నిష్కపటమైన క్షమాపణ కోరడం వల్లనే నాయకత్వానికి గౌరవం పెరుగుతుంది. పశ్చాత్తాపం అనేది కేవలం పెదాల మీద నుంచి వచ్చే మాట కాదు... అది ప్రవర్తనలో కనిపించే మార్పు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకున్నప్పుడే ఆ మాటలకు విలువ ఉంటుంది. లేదంటే చేతులు కాలాక చేసే పశ్చాత్తాపం కేవలం కాలక్షేపానికో, చట్టం నుంచి తప్పించుకోవడానికో చేసే 'రాజకీయ విన్యాసం'గానే మిగిలిపోతుంది. రాజకీయాల్లో హుందాతనం పెరగాలంటే నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

**అరెస్ట్ లపై అంబటి భార్య హైకోర్టుకు..**

అంబటి వ్యాఖ్యలపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడంతో అంబటి రాంబాబు సతీమణి విజయలక్ష్మి ఏపీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. తమకు సరైన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని, అక్రమ నిర్బంధాలు జరిగాయని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. 24 గంటల భద్రత కల్పించాలని కోర్టును కోరారు. అంబటి రాంబాబు పోలీసులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అరెస్టులకు భయపడేది లేదని, సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వంపై తన విమర్శలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఏపీ వ్యాప్తంగా హైటెన్షన్ వాతావరణం నెలకొనగా, గుంటూరులో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి నిప్పు...

- మొదటి పేజి తరువాయి

కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకున్నారు. తొలుత ఇంటిపై రాళ్లతో దాడి చేసి, ఆ తర్వాత ఇంటికి నిప్పుపెట్టారు. ఇంటి చుట్టూ ఉన్న వైసీపీ ఫ్లెక్సీలను కూడా దగ్ధం చేశారు. దాడి సమయంలో జోగి రమేశ్ ఇంట్లో లేరు. ఈ ఘటనలో ఇంటి మొదట అంతస్తులో మంటలు ఎగిసిపడ్డాయి.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుండగా, పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని శాంతింపజేసేందుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని, అయితే ఇంటికి మాత్రం తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## అమెరికాతో యుద్ధం కోరుకోవడం లేదు

- మొదటి పేజి తరువాయి

ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి.. అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ నాయకులు అశాంతిని రేకెత్తిస్తున్నారని ఆరోపించారు. అయితే, అగ్రరాజ్యంతో తాము యుద్ధం కోరుకోవడం లేదన్నారు. స్థానిక మీడియాలో ప్రసారమైన వీడియోలో పెజెష్కియాన్ (మీుంశీబుస ూవఓవంష్ట్రసెఖుఅ) మాట్లాడుతూ.. "అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, యూరప్ నేతలు మా సమస్యలను లక్ష్యంగా చేసుకున్నారు. మా ప్రజలను రెచ్చగొట్టి.. దేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నించారు. ఇప్పటికీ ప్రయత్నిస్తున్నారు" అని ఆరోపించారు. ఇరాన్‌లో జరిగిన ఆందోళనలు కేవలం సామాజిక నిరసనలు కావని అందరికీ తెలుసన్నారు. ఇక, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తాహ్ ఎల్‌సిసితో.. పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా అమెరికాతో తాము యుద్ధం కోరుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌కు గానీ, అమెరికాకు గానీ సంఘర్షణలు ప్రయోజనకరం కావని వ్యాఖ్యానించారు.

**చర్చలకు వచ్చిన ఇరాన్: ట్రంప్**

మరోవైపు, ఇరాన్ తమతో చర్చలకు వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. "వారు మాతో మాట్లాడుతున్నారు. ఏదైనా ఒప్పందం జరుగుతుందో లేదో చూడాలి. మొత్తంగా ఏం జరుగుతుందో చూద్దాం" అన్నారు. అయితే, అమెరికా యుద్ధనౌకలు ఇరాన్ దిశగా కదులుతున్నాయని పరోక్షంగా హెచ్చరికలు చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా దాడి ప్రణాళికల గురించి ఇప్పుడే ఏం చెప్పలేమన్నారు.

# రూ.53.5 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. యువశక్తిని చోదకశక్తిగా చేసుకుని, పేదలు, అణగారిన వర్గాల ప్రగతి లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆమె తెలిపారు. మొత్తం రూ.53.5 లక్షల కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ బడ్జెట్‌లో స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' దార్శనికతతో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం అనే మూడు ప్రధాన కర్తవ్యాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

**ప్రధాన కేటాయింపులు, ఆర్థిక అంచనాలు**

2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం రూ.53.5 లక్షల కోట్లుగా అంచనా వేయగా, మొత్తం రాబడులు (అప్పులు మినహా) రూ.36.5 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. కేంద్ర నికర పన్ను రాబడులు రూ.28.7 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2025-26 సవరించిన అంచనాల్లో ద్రవ్యలోటు 4.4 శాతంగా ఉంది. స్థూల మార్కెట్ రుణాలు రూ.17.2 లక్షల కోట్లుగా ఉంటాయని తెలిపారు.

**మౌలిక సదుపాయాలకు భారీ కేటాయింపులు**

దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేసింది. ప్రభుత్వ మూలధన వ్యయాన్ని (పబ్లిక్ క్యాపెక్స్) గత ఏడాది రూ.11.2 లక్షల కోట్ల నుంచి ఈసారి రూ.12.2 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ భారీ నిధులతో దేశవ్యాప్తంగా పలు కీలక ప్రాజెక్టులకు ఊతం లభించనుంది. ఇందులో భాగంగా పర్యావరణ అనుకూల ప్రయాణ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు ఏడు హై-స్పీడ్ రైల్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వీటిలో ముంబై-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు కారిడార్లు ఉన్నాయి. దీంతో పాటు తూర్పున డంకుని నుంచి పశ్చిమాన సూరత్ వరకు కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. రాబోయే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జలమార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**రంగాల వారీగా నిధుల కేటాయింపు**

ఈ బడ్జెట్‌లో పలు కీలక రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

**బయోఫార్మా:** బయోఫార్మా రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చే లక్ష్యంతో 'బయోఫార్మా శక్తి' పథకాన్ని ప్రకటించారు. దీనికోసం రాబోయే ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయించారు.

**ఎంఎస్‌ఎంఈ:** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి రూ.10,000 కోట్లతో 'ఎస్‌ఎంఈ గ్రోత్ ఫండ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**ఎలక్ట్రానిక్స్:** ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పథకం కోసం కేటాయింపులను రూ.40,000 కోట్లకు పెంచారు.

**పరిశ్రమలు:** కంటైనర్ల తయారీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఐదేళ్ల కాలానికి రూ.10,000 కోట్లు కేటాయించారు.

**పర్యావరణం:** కార్బన్ క్యాప్చర్, యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సీసీయూఎస్) టెక్నాలజీల కోసం రాబోయే ఐదేళ్లలో రూ.20,000 కోట్లు కేటాయించారు.

**పట్టణాభివృద్ధి:** నగర ఆర్థిక ప్రాంతాల (సిటీ ఎకనామిక్ రీజియన్స్) అభివృద్ధి కోసం ఒక్కో ప్రాంతానికి ఐదేళ్లలో రూ.5,000 కోట్లు కేటాయించనున్నారు.

**పన్నులు, ఇతర ప్రతిపాదనలు**

పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కల్పించేందుకు పలు సంస్కరణలు ప్రతిపాదించారు. ఏప్రిల్ 2026 నుంచి 'కొత్త ఆదాయపు పన్ను చట్టం, 2025' అమల్లోకి రానుంది. విదేశీ పర్యటన ప్యాకేజీలపై టీసీఎస్ రేటును 2 శాతానికి తగ్గించారు. వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే వస్తువులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 20% నుంచి 10%కి తగ్గించడం ద్వారా సామాన్యులకు ఊరట కల్పించారు.

క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే 17 రకాల మందులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని మినహాయించారు. మరోవైపు, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ని 0.02% నుంచి 0.05%కి పెంచారు. మొత్తం మీద ఈ బడ్జెట్, దీర్ఘకాలిక వృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా మౌలిక వసతులు, తయారీ రంగాలపై దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

**హైదరాబాద్ సహా వివిధ నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లు**

ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 1. పుణే-హైదరాబాద్, 2. హైదరాబాద్-బెంగళూరు, 3. హైదరాబాద్-చెన్నై, 4. ముంబై-పుణే, 5. బెంగళూరు-చెన్నై, 6. ఢిల్లీ-వారణాసి, 7. వారణాసి-సిలిగురి కారిడార్లను ప్రకటించారు. వారణాసి, పాట్నాలలో షిప్ రిపేర్ కర్మాగారాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఉపాధికి పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ కోసం బ్యాంకింగ్ రంగంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. టెక్స్‌టైల్ రంగం కోసం 5 సూత్రాలతో ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నామని, ఈ రంగం కోసం వచ్చే ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. సూక్ష్మతరహా పరిశ్రమల కోసం రూ.2 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దేశంలో మూడు ఆయుర్వేద ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. యువత కోసం వైద్య రంగంలో కొత్త కోర్సులను తీసుకు రానున్నట్లు తెలిపారు.

# బడ్జెట్ లో ఏపీకి వచ్చింది గుండు సున్నా

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక భాగస్వామిగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో విఫలమయ్యారని, 50 లక్షల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌లో ఏపీకి లభించింది గుండు సున్నా అని ఆమె విమర్శించారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రులను దగా చేసిన బడ్జెట్ అని, రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కేంద్రం అణగదొక్కిందని ఆరోపించారు.ఈ బడ్జెట్‌పై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "విభజన హామీలలో ఒక్కదానికీ దిక్కులేదు. ప్రత్యేక హోదా ఊసే లేదు. వెనకబడిన ఉత్తరాంధ్రకు, రాయలసీమకు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. రాష్ట్ర జీవనాడి పోలవరానికి నిధులు కేటాయించకుండా జీవం తీశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కనికరం చూపలేదు, కడప స్టీల్ ప్లాంట్ వైపు కన్నెత్తి చూడలేదు. మెట్రో రైలు, పారిశ్రామిక కారిడార్ల ప్రస్తావనే లేదు" అని షర్మిల దుయ్యబట్టారు.

అమరావతి రాజధాని నిర్మాణంపై కేంద్రం తీరును ఆమె తప్పుబట్టారు. లక్ష కోట్ల రూపాయలతో నిర్మించాలనుకున్న రాజధానికి కేవలం రూ.1,500 కోట్ల అప్పు ఇప్పిస్తామనడం దారుణమని అన్నారు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత కాదా అని ప్రశ్నించారు. గతేడాది ఇస్తామన్న రూ.15 వేల కోట్ల అప్పు ఏమైందని నిలదీశారు. పోలవరం ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కేవలం రూ.3 వేల కోట్లు కేటాయించడంపై మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నట్లుగా ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్లకు పెంచే ప్రతిపాదనను కేంద్రం పట్టించుకోలేదని, కేవలం 41.15 మీటర్లకే పరిమితం చేయాలని చూస్తోందని ఆరోపించారు. రూ.20 వేల కోట్ల పునరావాస ప్యాకేజీ కోసం ప్రాజెక్టును బలిపెడుతున్నారని, ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా పెద్దన్న పాత్ర పోషిస్తున్న చంద్రబాబు నోరు మెదపకపోవడం సిగ్గుచేటని షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండటం ఆయన పాలనా తీరుకు నిదర్శనమని విమర్శించారు.

# పనిచేసే వారికి పట్టం.. మారకుంటే నమస్కారం..

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన సొంత నియోజకవర్గం కుప్పంపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. కుప్పంలో ఆదివారం నాడు నియోజకవర్గ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను వెతుక్కుని వచ్చి గౌరవిస్తానని భరోసా ఇస్తూనే, పనితీరు మార్చుకోని నేతలకు గట్టి హెచ్చరికలు పంపారు. ఇదే సమావేశంలో, నాడు నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రూపొందించిన ప్రత్యేక గీతాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికి ఉన్నత పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. "ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టకున్నా పార్టీ జెండా మోసిన షణ్ముఖ రెడ్డికి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడమే ఇందుకు నిదర్శనం. నిన్నటి వరకు సామాన్య కార్యకర్తగా ఉన్న ఆయన, ఈరోజు పార్లమెంట్ అధ్యక్షుడయ్యారు. ఇదే తెలుగుదేశం పార్టీలో ఉండే గుర్తింపు" అని పేర్కొన్నారు. తన కష్టాన్ని గుర్తించినందుకు షణ్ముఖ రెడ్డి భావోద్వేగానికి గురై అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఎన్ని సంక్షోభాలు ఎదురైనా టీడీపీ నిలదొక్కుకోగలిగిందని, అందుకే ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేనంతటి మెజారిటీని కూటమికి కట్టబెట్టారని చంద్రబాబు అన్నారు. వైసీపీ కనీసం ప్రతిపక్ష హోదాకు దరిదాపుల్లోకి కూడా రాలేకపోయిందని, ప్రజలతో మమేకమైతేనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. "నా రాజకీయ జీవితం 2028 నాటికి 50 ఏళ్లకు చేరుకుంటుంది. ప్రజల భవిష్యత్, వారి సంక్షేమం కోసమే నా ప్రతి ఆలోచన ఉంటుంది" అని తెలిపారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడుతూ, ఒకే సీజన్‌లో హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చామని, లేదంటే ఈ ప్రాంతం తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనేదని గుర్తుచేశారు. "రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పాం.. చేసి చూపించాం. దేశంలోనే ఉద్యాన ఉత్పత్తుల్లో రాయలసీమ అగ్రస్థానంలో ఉంది. దీనిని మరింత అభివృద్ధి చేస్తాం" అని హామీ ఇచ్చారు. అమరావతి వంటి నగరాలు దేశానికి అవసరమని ఆర్థిక సర్వే కూడా చెప్పిందని గుర్తుచేశారు. తన పాలనా శైలిని వివరిస్తూ, "నేను నిర్మొహమాటంగా మాట్లాడతా, వాస్తవాలు చెబుతా. తప్పులు సరిచేసుకోమని సూచిస్తా. అప్పటికీ పనితీరు మార్చుకోకపోతే నమస్కారం పెట్టి పక్కన పెడతాను" అని గట్టిగా హెచ్చరించారు. ప్రతి వారం ఎమ్మెల్యేల పనితీరును సమీక్షిస్తున్నానని, కార్యకర్తలకు, తనకు మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా టెక్నాలజీని వినియోగిస్తున్నామని చెప్పారు. కూటమిలోని మిత్రపక్షాలతో కలిసి పనిచేయాలని, సంక్షేమ పథకాల అమలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. కుప్పంలోని 150 చెరువులను నింపినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించాలని కోరారు.

# కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల ఫైర్..

- మొదటి పేజి తరువాయి

ఆర్థిక, సామాజిక సవాళ్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరుద్యోగం, తయారీ రంగం క్షీణత, రైతుల కష్టాలు వంటి కీలక సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ ఘోరంగా విఫలమైందని ఆయన ఆదివారం విమర్శించారు.ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ స్పందించారు. "ఉద్యోగాలు లేని యువత, పడిపోతున్న తయారీ రంగం, దేశం నుంచి తరలిపోతున్న పెట్టుబడులు, కుప్పకూలుతున్న కుటుంబ పొదుపు, రైతుల కష్టాలు, పొంచివున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభాలు... వీటన్నింటినీ బడ్జెట్ పట్టించుకోలేదు. దిద్దుబాటు చర్యలకు నిరాకరిస్తున్న ఈ బడ్జెట్, భారతదేశ వాస్తవ సంక్షోభాల పట్ల గుడ్డిగా వ్యవహరిస్తోంది" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు ఇతర విపక్ష నేతలు కూడా బడ్జెట్‌పై పెదవివిరిచారు. వృద్ధిని పునరుద్ధరించడానికి, ఉపాధి కల్పించడానికి ఇందులో సరైన సంస్కరణలు లేవని విమర్శించారు.సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మరో అడుగు ముందుకేసి, స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమని ఆరోపించారు. "బీజేపీ బడ్జెట్ ఫలితం ఇదిగో.. షేర్ మార్కెట్ భారీగా కుప్పకూలింది. ఆదివారం మార్కెట్ తెరుస్తారా లేదా అన్నది ప్రశ్న కాదు, అది ఇంకా ఎంత పడిపోతుందన్నదే అసలు ప్రశ్న అని మేము ముందే చెప్పాం" అని ఆయన అన్నారు. ఈ బడ్జెట్ కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని, కమీషన్లు దక్కించుకోవడానికి, బీజేపీ సొంత వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చడానికే దీన్ని రూపొందించారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. "ఇది బీజేపీ తరహా అవినీతికి కంటికి కనిపించని లెక్కల చిట్టా" అని అఖిలేష్ అభివర్ణించారు.

అనియంత్రితంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం సమయంలో పన్ను ఉపశమనం కల్పించకపోవడం 'పన్ను దోపిడీ' కిందకే వస్తుందని ఆయన విమర్శించారు. సంపన్నులకు వ్యాపారం, ప్రయాణాల కోసం పదుల రకాల మినహాయింపులు ఇచ్చి, నిరుద్యోగులకు మాత్రం 'ఆశల ఖాళీ పళ్లెం' చూపించారని ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్ వల్ల మధ్యతరగతి ప్రజలు పూర్తిగా మోసపోయినట్లు భావిస్తున్నారని, పేదలు మరింతగా కుంగిపోతున్నారని అన్నారు. రైతులు, కార్మికులు, చిరు వ్యాపారులు టెలిస్కోప్‌తో వెతికినా తమ కోసం ఇందులో ఏమీ కనిపించలేదని, ఇది తీవ్ర నిరాశాజనకమైన, దారుణమైన బడ్జెట్ అని అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు.బడ్జెట్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విజన్, మిషన్, దిశానిర్దేశం లేని బడ్జెట్ అని, పూర్తిగా అబద్ధాలతో నిండి ఉందని ఆమె అభివర్ణించారు.

ఢిల్లీ పర్యటనకు బయలుదేరే ముందు కోల్‌కతా విమానాశ్రయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ బడ్జెట్ ద్వారా కేంద్రం దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తోందని ఆరోపించారు."ఈ బడ్జెట్‌కు ఎలాంటి లక్ష్యం లేదు. ఇది పూర్తిగా పేదలు, మహిళలు, రైతులు, యువత, సామాన్యులతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వ్యతిరేకమైనది. విద్యా రంగానికి కేటాయింపులు లేవు. విద్యా సబ్సిడీ, సామాజిక భద్రతా సబ్సిడీ, ఎరువుల సబ్సిడీలను తగ్గించారు. ఇది పూర్తిగా అబద్ధాల కుప్ప" అని మమత తీవ్రంగా విమర్శించారు.

పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం ఒక్క పైసా కూడా కేటాయించలేదని ఆమె ఆరోపించారు. "మా రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదు. జీఎస్టీ రూపంలో మా డబ్బును వారే తీసుకెళ్లి, తిరిగి మేమే ఇస్తున్నట్టు గొప్పలు చెబుతున్నారు. ప్రభుత్వాన్ని నడిపే నైతిక హక్కు వారికి లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు

## టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ... రవిచంద్రకు బాధ్యతలు

- మొదటి పేజి తరువాయి

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి (ఈవో) అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేడు (ఫిబ్రవరి 1న) ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. అనిల్ కుమార్ సింఘాల్‌ను తక్షణమే సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. 1993 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అనిల్ కుమార్ సింఘాల్, 2017 మే నుంచి 2020 అక్టోబర్ వరకు తొలిసారి టీటీడీ ఈవోగా సేవలందించారు. అనంతరం గతేడాది సెప్టెంబరులో రెండోసారి ఈ పదవిని చేపట్టారు. కేవలం ఐదు నెలల కాలంలోనే ఆయన బదిలీ కావడం టీటీడీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై సిట్ నివేదిక వచ్చిన కొన్ని రోజుల్లోనే ఈ బదిలీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఏపీ అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ ఒక వరం... ఇది ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్

- మొదటి పేజి తరువాయి

దోహదపడుతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి ఈ బడ్జెట్ మరింత ఊతమిస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈల బలోపేతానికి తాము ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా కేంద్రం 75 శాతం క్రెడిట్ గ్యారెంటీ ఇవ్వడం, రాష్ట్రం తరపున మరో 20 శాతం అందిస్తుండటంతో ఈ రంగానికి భరోసా లభిస్తుందని తెలిపారు. మహిళలు, రైతులు, యువత సాధికారత సాధించేలా ఈ బడ్జెట్ ఉందని, ఇది 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్'గా, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. ఆర్థిక మంత్రి సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని, దేశానికి సరైన దిశానిర్దేశం చేసేలా ఉందని కొనియాడారు.

**రవాణా, టెక్నాలజీ రంగాలకు పెద్దపీట**

ఈ బడ్జెట్‌లో ప్రకటించిన మూడు కీలకమైన హైస్పీడ్ రైల్ కారిడార్లు (హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, బెంగళూరు-చెన్నై) ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా అమరావతి, తిరుపతి, పలమనేరు, చిత్తూరు వంటి కీలక ప్రాంతాలు అనుసంధానమవుతాయని తెలిపారు.

అలాగే, రాష్ట్రంలో ఉన్న 'రేర్ ఎర్త్ కారిడార్' ద్వారా విలువైన ఖనిజాలను వెలికితీసి, క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి మార్గం సుగమం అవుతుందన్నారు. ఐఎస్‌ఎం 2.0 కింద సెమీకండక్టర్ల కోసం రూ.40 వేల కోట్లు, టెక్స్‌టైల్ రంగానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.డేటా సెంటర్లకు 2047 వరకు పన్ను మినహాయింపులు ఇవ్వడం ఒక చారిత్రక నిర్ణయమని చంద్రబాబు అన్నారు. దీనివల్ల భారత్ గ్లోబల్ డేటా హబ్‌గా మారుతుందని, ఇప్పటికే విశాఖకు గూగుల్ వంటి సంస్థలు వస్తున్నాయని గుర్తుచేశారు. ఈ డేటా సెంటర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అభివృద్ధికి ఊతమిచ్చి, భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో బిల్ గేట్స్ కూడా అమరావతిలో పర్యటించనున్నారని, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి నెక్స్ట్ జెన్ టెక్నాలజీలకు ఏపీ చిరునామాగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

**పర్యాటకం, వ్యవసాయ రంగాలకు ఊతం**

కేంద్ర బడ్జెట్‌లో అరకు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే అంశాన్ని చేర్చడం హర్షణీయమని సీఎం అన్నారు. దీంతోపాటు పులికాట్ సరస్సు అభివృద్ధికి నిధులు కేటాయించడం వల్ల ఫ్లెమింగో వంటి అరుదైన పక్షుల సంరక్షణకు, పర్యాటక వృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈస్ట్ కోస్ట్ కారిడార్, అంతర్గత జలరవాణాకు నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్రంలోని వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం లాజిస్టిక్స్ పరంగా గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.

కొబ్బరి, జీడి, కోకో, చందనం వంటి ఉద్యాన పంటలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా రాయలసీమను ప్రపంచంలోనే అత్యుత్తమ హార్టికల్చర్ క్లస్టర్‌గా తీర్చిదిద్దుతామని, 'పూర్వోదయ' పథకం నిధులు ఇందుకు దోహదపడతాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'సంజీవని' ప్రాజెక్టు ఈ ఏడాది గేమ్ ఛేంజర్‌గా మారుతుందని, ఇది బయోసైన్స్‌లో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని చంద్రబాబు తెలిపారు. 2019-24 మధ్య వారసత్వంగా వచ్చిన సమస్యలను పరిష్కరించుకుంటూ, కేంద్ర బడ్జెట్ అందించిన అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రంలో హింసాత్మక పాలన-బుర్రా మధుసూదన్ యాదవ్



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 1**
రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో హింసాత్మక పాలన చేస్తున్నారని మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైకాపా ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.మాజీ మంత్రి అంబటి రాంబాబు , జోగి రమేష్, విడదల రజిని పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. బాబు పాలనలో ఏపీ జంగిల్ రాజ్ అయిపోయింది అని,ఆంధ్రప్రదేశ్ లో పరిస్థితులు చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ఖూనీ చేసిన తెలుగుదేశం ప్రభుత్వం నియంతృత్వ పాలనకు తెరతీసింది అని అర్థమవుతుంది అని అన్నారు. మాజీ మంత్రి విడదల రజిని , అంబటి రాంబాబును జోగి రమేష్ ఆయన ఇంటిని టిడిపి గుండాలు ధ్వంసం చేశాయి. ఈ విధ్వంసాన్ని చంద్రబాబు సమాధానం చెప్పాలి అని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా ఇది ప్రజాస్వామ్యమా ఆటవిక పాలన? రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రాన్ని హింసకు కేరాఫ్ గా మారుస్తున్నారు. మాజీ మంత్రులకే రక్షణలేని పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని బుర్రా మధుసూదన్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగఫలమే మనం అనుభవించే స్వేచ్ఛా వాయువులు..

*అమరవీరుల ప్రాణ త్యాగం - దేశానికి గర్వకారణం..*

*అమరవీరుల స్తూపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు.*







**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 1**
గిద్దలూరు నియోజకవర్గంలో దేశ భక్తికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే అమరవీరుల స్తూపం ప్రారంభోత్సవ కార్యక్రమం రాచర్ల మండలం, ఆకవీడు గ్రామంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి , మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటగా జాతీయ జెండాను ఆవిష్కరణ చేసి జెండా వందనం చేశారు అనంతరం రిబ్బన్ కట్ చేసి అమరవీరుల స్తూపాన్ని ప్రారంభించారు. దేశ రక్షణలో అమరులైన వీర జవాన్లకు నివాళులు అర్పించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశ రక్షణలో సైనికుల పాత్రను కొనియాడుతూ ప్రసంగం చేశారు. దేశ సరిహద్దుల్లో పహారా కాస్తూ, మనందరి క్షేమం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయని సైనికుల త్యాగం వెలకట్టలేనిదని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పేర్కొన్నారు. అమరవీరుల జ్ఞాపకార్థం నిర్మించిన ఈ స్తూపం, రాబోయే తరాలకు దేశభక్తిని పెంపొందించే స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ఆకాంక్షించారు. గిద్దలూరు నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉందని, ఇక్కడ నుంచి అత్యధిక సంఖ్యలో యువత భారత సైన్యంలో చేరుతున్నారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. దేశ సేవ కోసం ప్రాణాలకు తెగించి పోరాడే ధైర్యవంతులు గిద్దలూరు మట్టిలో పుట్టడం మనందరికీ గర్వకారణ మన్నారు. ప్రతి గ్రామం నుండి ఎవరో ఒకరు దేశ రక్షణలో పాలుపంచుకోవడం ఈ ప్రాంత గొప్పతనానికి నిదర్శన మన్నారు. మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించడంలోనూ, వారి సంక్షేమ పథకాలను చేరవేయడంలోనూ ముందుం టానని హామీ ఇచ్చారు. "సైనికుడు అంటే కేవలం ఒక వృత్తి కాదు, అది ఒక పవిత్రమైన బాధ్యత అని గిద్దలూరు గడ్డపై ఇంతమంది దేశభక్తులు ఉండటం నాకెంతో సంతోషాన్నిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కందుకూరులో
# క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటుకు కృషి

### -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
### -క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 1:**
వచ్చే ఏడాది జనవరి కల్లా కందుకూరు పట్టణంలో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేయిస్తానని కందుకూరు శాసనసభ్యులు నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా పడమటి బలిజపాలెం యూత్ ఆధ్వర్యంలో గతనెల 23 తేదీన స్థానిక ఏఎంసి ప్రాంగణంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ మొదలైంది. ఆ పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తన గెలుపులో పట్టణ యువత కీలకంగా వ్యవహరించారని అన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా తన సంపూర్ణ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు కోసం యువకులు అనేకసార్లు తన దృష్టికి తీసుకువచ్చారని, వచ్చే ఏడాది జనవరి 23 లోకేష్ బాబు పుట్టినరోజు నాటికి కందుకూరులో క్రికెట్ గ్రౌండ్ తప్పక ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. లోకేష్ పుట్టినరోజు సందర్భంగా యువత ఇంత పెద్ద ఎత్తున పోటీలు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ... నిర్వాహకులను ఎమ్మెల్యే నాగేశ్వరరావు అభినందించారు.

ఈ టోర్నమెంట్లో మొత్తం 28 జట్లు పాల్గొనగా కందుకూరు పట్టణానికి చెందిన ఛాంపియన్స్ లెవెన్ జట్టు విన్నర్ గా నిలిచింది. విన్నర్స్ క్లబ్ టీం రెండో స్థానం సంపాదించింది. విన్నర్స్ జట్టుకు ఎమ్మెల్యే నాగేశ్వర రావు 55,516 రూపాయల నగదు, రన్నర్స్ జట్టుకు టిడిపి నాయకుడు తలతోటి మస్తాన్ 35,116 రూపాయల నగదు బహుమతిని గతంలో ప్రకటించగా ఎమ్మెల్యే ఆ రెండు జట్లకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కె. కళ్యాణ్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ అధికార ప్రతినిధి షేక్ రఫీ, అల్లం వెంకటేశ్వర్లు, గొంది నరసింహారావు, వడ్లమూడి సురేష్, అబ్బూ రి వేణు, పసుపులేటి రమణయ్య, పులి నాగరాజు, ఉన్నం కొండలరావు, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్- మాగుంట



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 01**
వికసిత్ భారత్ 2047 విజన్ కు అనుగుణంగాలోక్ సభలో కేంద్ర ఆర్థిక మంత్రి, నిర్మలా సీతారామన్ 9 సారి ప్రవేశపెట్టిన రూ.53.47 లక్షల కోట్లతో 2026–27 పూర్తి స్థాయి బడ్జెటులో 3 కర్తవ్యాల రూపకల్పనతో మౌలిక సంక్షేమ రంగాలకు పెద్దపీట వేశారని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాలకు రూ.12.2 లక్షల కోట్లు, గ్రామీణాభివృద్ధి రూ.2.73,108 కోట్లు, వ్యవసాయం -- అనుబంద రంగాలకు రూ. 1.62,671 కోట్లు, విధ్య -- నైపుణ్యాభివృద్ధికి రూ.1.39,289 కోట్లు, ఆరోగ్యం – వైద్యానికి రూ. 1,04,599 కోట్లు, రక్షణకు రూ. 5,94,585 కోట్లు, హోంకు రూ.2,55,234/- కోట్లు, విద్యుత్ కు రూ. 1,09,029 కోట్లు, రవాణాకు రూ. 5,98,520 కోట్లు, పట్టణాలకు కోట్లు, రూ.85,522 కోట్లు, వాణిజ్యానికి రూ. 70,296 కోట్లు, సంక్షేమానికి రూ.62,362 కోట్లు, ఐ.టి.-- టెలికంకు రూ.74,560 కోట్లు, తదితర అన్ని రంగాలకు కూడా సముచితంగా నిధులు కేటాయింపులు చేశారని తెలిపారు. ఈ బడ్జెట్లో ఏ.పి.లో మినరల్ కారిడార్, బెంగాల్ నుండి గుజరాత్ వరకు రవాణా సదుపాయ కారిడార్, 3 కెమికల్ రీచర్చ్ పార్కులు, టెక్స్ టైల్స్ పార్కులు, 20 జలమార్గాల అభివృద్ధి, 7 నగరాల మధ్య హైస్పీడ్ రైళు ్ళ, 3 ఆయుర్వేద ఎయిమ్స్ వైద్యశాలలు, ప్రతి జిల్లాలో బాలికలకు హాస్టళ్ళు, 2 హై టెక్ ఔషద విద్య సెంటర్లు, 5 వేల విధ్యుత్ బస్సులు, విదేశీ ఆస్తుల తప్పనిసరి వెల్లడి, పన్నుల పరిధిలోకి మానవ వనరుల సరఫరా సంస్థలు, కార్పోరేట్ కొనుగోళ్ళపై పన్ను పెంపుదల, 500 చేపల సరస్సులు, విద్యా సంస్థలలో లాబ్స్, జరిమానా చెల్లించే వారికి శిక్ష మినహాయింపు, వ్యక్తిగత ఆదాయ పన్ను యదాతథం, 15 పురావస్తు కేంద్రాల అభివృద్ధి, డేటా సెంటర్లకు పన్ను మినహాయింపు, రాష్ట్రాలకు రూ.1.4 లక్షల కోట్లు కేటాయింపు, అధిక వస్తువులకు పన్నులు తగ్గింపు ప్రత్యేకతలు అని తెలిపారు. బడ్జెటులోని కొన్ని ముఖ్యాంశాలు. విభజన లోటు లోని ఆంధ్రప్రదేశ్ వినతిని మన్నించి, పోలవరానికి రూ.3,320 కోట్లు, అమరావతికి రూ.1,129 కోట్ల తోపాటు తదితర పనులకు నిధులు కేటాయించి, సమతుల్య బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు ఆర్థిక మంత్రి, నిర్మలా సీతారామన్ కి, ప్రధాన మంత్రి, నరేంద్ర మోదీ కి, రాష్ట్ర ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు కి మాగుంట ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్రవ్యాప్తంగా రూ. 800 కోట్ల సహాయం అందజేత -మంత్రి గొట్టిపాటి. రవికుమార్

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, ఫిబ్రవరి 1:**
నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆర్థికంగా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా, అద్దంకి నియోజకవర్గంలోని ముప్పవరం క్యాంప్ కార్యాలయంలో ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 108 మంది బాధితులకు మంజూరైన చెక్కులు, ఎల్వోసీ పత్రాలను ఆయన స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించి, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 800 కోట్ల మేర ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అనారోగ్యంతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది, అప్పుల పాలవుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరమని ఆయన కొనియాడారు. కేవలం అద్దంకి నియోజకవర్గంలోనే వందలాది మందికి ఈ సహాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు.





**అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు**
వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించి, సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, క్షేత్రస్థాయిలోనే పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏ ఒక్క లబ్ధిదారుడు నష్టపోకూడదని, ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, భారీ సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 10 లోపు సంస్థాగత కమిటీలు పూర్తి చేయాలి..

### భీమిలి నియోజకవర్గ వైసిపి విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కదిరి.



**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 1**
వైసిపి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు సంస్థాగతంగా కమిటీలు ఎంతో కీలకమని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అన్నారు. ఆదివారం భీమిలి నియోజకవర్గం వైసీపి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగాహాజరైన విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు మాట్లాడుతూ ఫిబ్రవరి 10 లోపు కమిటీలు పూర్తి చేసి నియోజకవర్గం లో వైసిపి పార్టీని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. అదేవిదంగా చంద్రబాబు, లోకేష్ 5000 వేల కోట్లు విలువచేసే 54ఎకరాల ప్రభుత్వ భూమిని తమ బంధువుల కు సంభందించిన గీతం కళాశాలకు కట్టబెట్టడం దారుణమన్నారు. ఆస్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించడం జరిగిందని ఇప్పుడు గీతం కళాశాలకు ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డులో కొవ్వు పదార్థలు లేవని సుప్రీం కోర్ట్ చెప్పిన దేవుడు ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే కేసులు పెట్టి నాయకులకు, కార్యకర్తలకు ఇబ్బంది పెడుతున్నారని లోకేష్ రెడ్ బుక్ రాజ్యం నడుస్తుందని విమర్శించారు. మళ్ళీ మన ప్రభుత్వం వస్తుందని జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ఎవరు భయపడొద్దని చంద్రబాబు ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మియోజకవర్గం ఇంచార్జి, విజయనగరం జడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కెకె. రాజు, మాజీ ఎమ్మెల్యే లు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# నాట్య కళాకారులకు ఎమ్మెల్యే ప్రశంసలు





**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 1**

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో స్థానం సంపాదించుకున్న కందుకూరుకు చెందిన నాట్య కళాకారులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ఘనంగా సత్కరించారు. గత ఏడాది డిసెంబర్ 27వ తేదీన హైదరాబాదులో, భారతి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం -2 కార్యక్రమం జరిగింది. దీనికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు హాజరయ్యారు. కాగా కందుకూరు పట్టణంలోని శ్రీ నటరాజ నాట్యమండలి మరియు సరస్వతి నిలయానికి చెందిన 16 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొని అత్యద్భుతమైన నృత్య ప్రదర్శన ఇచ్చారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో స్థానం సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా కందుకూరులోని టిడిపి కార్యాలయంలో నాట్యమండలి నిర్వాహకులు తిరుమల శెట్టి వెంకట దత్తేశ్వరి, ప్రేమ్ కుమార్, చిన్నారులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.

## టి ఆర్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మ్యాగ్జైన్‌ను ఆవిష్కరించిన మంత్రి ఆనం



**కందుకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 1**

టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మ్యాగజైన్ ను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి లాంచనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించిన పలు ఆసక్తికర, విద్యా విషయక అంశాలను జోడించి, మ్యాగజైన్ ను రూపొందించడం శుభ పరిణామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ షేక్ నాగూర్ వలి ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఎంపీ. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు , ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజా బాబు , ఎమ్మెల్సీ బీద రవిచంద్ర , కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ , మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ ఫిబ్రవరి 01**

ప్రతి నెల మొదటి ఆదివారం వాకర్స్ ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆదివారం ఉదయం ఒంగోలు ముంగమూరు రోడ్డు లోని చెన్నకేశవస్వామి లేఔట్ నందు గల ఎన్టీఆర్ పార్కు లో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 150 మంది పేషెంట్లు పాల్గొని ఉచితంగా బిపి, షుగర్, ఈసీజీ, హెచ్. బి, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష, పాదాల నరాల స్పర్శ పరీక్ష, ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్షలు లాంటి సుమారు ఐదు వేల రూపాయల విలువగల పరీక్షలు ఉచితంగా పొందారు. అనంతరం ఎముకలు, కీళ్ల ఆరోగ్యం గురించి షుగర్ రోగులు తీసుకొనవలసిన జాగ్రత్తలు, ఆహార నియమాలు గురించి అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరం నందు ప్రముఖ ఎముకలు, నరాలు, కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ పల వంశీ కృష్ణ, క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు డాక్టర్ ముప్పరాజు దీప్తి,రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ కగ్గా చైతన్య ప్రియ ప్రజలను పరీక్షించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు.

## నేడు మీకోసం కార్యక్రమం తాత్కాలికంగా రద్దు - జిల్లా ఎస్పీ

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 01**

ఈ నెల 2వ తేదీన సోమవారం ప్రకాశం జిల్లా అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం లో సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఈ మేరకు జిల్లా ప్రజలు గమనించి రావద్దని సూచించారు.

# చిరస్మరణీయుడు ఎన్టీఆర్ -ఎమ్మెల్యే ఇంటూరి

## -ఎన్టీఆర్ కళాపరిషత్ కళల పండుగలో పాల్గొన్న నాగేశ్వరరావు

**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 1:**

ఒంగోలులో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళల పండుగ కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి , గొట్టిపాటి రవికుమార్ , ఇతర నేతలతో కలిసి ఆయన వేదికపై ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరావు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల చెరగని జ్ఞాపకం అని, తెలుగుజాతి ఉనికిలో ఉన్నంతవరకు ఆ మహానుభావుడిని మరిచిపోరన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి పేరు మీద కళాపరిషత్ స్థాపించి, ప్రతి ఏటా ఆయన వర్ధంతి సందర్భంగా నాటక పోటీలు నిర్వహించటం గొప్ప విషయమన్నారు. 27 ఏళ్లుగా ఈ కళల పండుగను నిర్వహిస్తున్న మాజీ శాసనసభ్యులు ఈదర హరిబాబు ని ఎమ్మెల్యే పొగడ్తలతో ముంచెత్తారు. ఒంగోలులోని తురకపాలెం ప్రాంత మహిళలు, చిన్నారులు



ప్రదర్శించిన కోలాటాన్ని అతిథులు తిలకించి మెచ్చుకున్నారు.



# కేంద్ర బడ్జెట్ పై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హర్షం

**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 1**



భారత ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2026-27 ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు పునాదిని సూచిస్తోందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. అందరికీ అభివృధి అనే నినాదాన్ని ప్రతిబింబిస్తుంది అన్నారు. న్యూఢిల్లీ పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్ 2026--27 పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగాఎన్డీఏ సర్కార్ ముందుకు సాగుతోందని చెప్పారు. ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2026--27ని స్వాగతిస్తూ, ఆంధ్రప్రదేశ్కు కొత్త వృద్ధి అవకాశాలను కల్పిస్తోందని తెలియజేశారు. వికసిత్ భారత్ సాధించాలనే దీర్ఘకాలిక లక్ష్యంతో కూడినదిగా అభివర్ణించారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పటికీ, మోదీ ప్రభుత్వం ఆర్థిక లోటును తగ్గించడం, రుణ-జీడీపీ నిష్పత్తిని తగ్గించడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించి, అధిక వృద్ధిని సాధించిందన్నారు. మౌలిక సదుపాయాలు పెట్టుబడులకు భారీ ప్రోత్సాహం ఎంపీ 12.2 లక్షల కోట్లకు పెరిగిన మూలధన వ్యయాన్ని ప్రశంసిస్తూ, ఇది ఉపాధి కల్పన, కనెక్టివిటీని మెరుగుపరచడం ప్రైవేట్ పెట్టుబడులను ప్రేరేపిస్తుంది అన్నారు. నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, విశాఖపట్నం వంటి నగరాలను బలోపేతం చేస్తుందనీ చెప్పారు. ఎమ్మెస్ ఎం ఈల పై బడ్జెట్ ను ప్రశంసిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది అవుతుందన్నారు. 10,000 కోట్ల ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్, టిఆర్ఈ డిఎస్ ద్వారా క్రెడిట్కు మెరుగైన అందుబాటు, సరళీకృత సమ్మతి వంటి కీలక చర్యలకు కేంద్రం శ్రీకారంతో చుట్టిందని చెప్పారు.

# స్వీయరక్షణకు కరాటే శిక్షణ ఉపయోగకరం

## - సిద్ధార్థ కరాటే అకాడమీ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 01**

ప్రతి ఒక్కరు కరాటే శిక్షణ పొందితే వారి స్వీయ రక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వానికి కరాటే శిక్షణ ఎంత దోహదం చేస్తుందని సిద్ధార్థ కరాటే అకాడమీ అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు హైదరి క్లబ్ నందు సిద్ధార్థ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 44వ వార్షికోత్సవం కరాటే బెల్ట్ గ్రేడ్ ఎగ్జామ్ చీఫ్ ఎగ్జామినర్ నల్లూరి మోహన్ రావు పర్యవేక్షణలో జరిగినది. ఈ సందర్భంగా మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ సిద్ధార్థ కరాటే అకాడమీ ఆంధ్ర ప్రదేశ్ కర్ణాటక తెలంగాణ రాష్ట్రాలలో 50 శాఖలు నడుస్తున్నాయని తెలిపారు. వేలాదిమంది కరాటే శిక్షణ పొందుతున్నారని, ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో తమ అకాడమీ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. ఈ బెల్ట్ గ్రేడ్ ఎగ్జామ్ లో 45 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 8 మంది బ్లాక్ బెల్ట్ కి మిగిలినవారు ఆరెంజ్ పర్పుల్ బ్లూ ఎల్లో బెల్ట్ లకు ప్రమోట్ అయ్యారని తెలిపారు. ఈ వేసవిలో ఉచిత కరాటే క్యాంపులు నిర్వహించే ఆలోచనలో




ఉన్నామని తెలిపారు. విద్యార్థినీ , విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్ట్ లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కరాటే డూ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గుండవరపు రాఘవ, సిద్ధార్థ కరాటే అకాడమీ ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు, కోచ్ లు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గర్భిణీలు రక్తహీనతను ఎలా అధిగమించాలి

### " ప్రసూతి స్త్రీ సంతాన సాఫల్య వైద్యురాలు యమ్. స్వర్ణలక్ష్మి సూచనలు

### " సుఖప్రసావానికి 10 శాతం హిమోగ్లోబిన్ ఉండాలి.

**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి1**



గర్భిణీలలో ముఖ్యంగా రక్తహీనత కనబడుతుంది రక్తహీనతను నిర్లక్ష్యం చేయడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. రక్తహీనత లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్న చిట్కాలతో రక్తహీనతను అధిగమించవచ్చని ప్రసూతి మరియు స్త్రీ వైద్య నిపుణులు యమ్. స్వర్ణలక్ష్మి తెలిపారు. సృష్టి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ యమ్. స్వర్ణలక్ష్మి మాట్లాడుతూ రక్తహీనత అంటే ఆనమీయా రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండడం వల్ల ఆక్సిజన్ కొరత ఏర్పడుతుంది హిమోగ్లోవిన్ అన్ని అవయవాలకు ఆక్సిజన్ అందిస్తుంది. అవయవాలకు ఆక్సిజన్ అనేది చాలా ముఖ్యం రక్తహీనత ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా గర్భిణీల్లో కనిపిస్తుంది. గర్భిణీలలో రక్తం డయల్యుయేషన్ ఎక్కువగా ఉంటుంది నీటి శాతం పెరగడం వల్ల రక్తం పలుచబడుతుంది దీంతో అనేమియా గర్భిణీలలో సాధారణంగా వస్తుంది. సాధారణ మహిళల్లో హిమోగ్లోవింగ్ 12 నుంచి 14 శాతం ఉంటుంది. గర్భిణీలకు 12 నుండి పది శాతానికి తగ్గిపోతూ ఉంటుంది. 8 శాతానికి హిమోగ్లోబిన్ పడిపోతే సివియర్ అనేమియా10 శాతం హిమోగ్లోబిన్ ఉంటే కాన్పు సమయంలో రిస్క్ తక్కువగా ఉంటుంది. గర్భిణీలకు ఐరన్ ఎక్కువ అవసరం ఉంటుంది. ముఖ్యంగా ఆకుకూరలు, పప్పులు, బెల్లం, పల్లిపట్టిలు, నువ్వుల లడ్డు, తాజా పండ్లు, కూరగాయలు, మటన్, లివర్, గుడ్లు, తీసుకుంటే హిమోగ్లోవింగ్ త్వరగా పెరుగుతుందని యమ్. స్వర్ణలక్ష్మి అన్నారు.

**రక్తహీనత లక్షణాలు**

ఆయాసం, కాళ్లు, చేతులు, నొప్పులు, రక్తహీనత ఎక్కువగా ఉంటే మొహం, కాళ్ల వాపులు, ముఖం పాలిపోయినట్టు ఉండడం, గర్భిణీలు రక్తహీనతను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లే అవకాశాలు ఉంటాయి. గర్భిణీకి మొదటి మూడు నెలలు రక్తహీనత ఎక్కువగా ఉంటే అబార్షన్ అయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. రక్తహీనత రెండో దశలో : లోపల బిడ్డ పెరగకపోవడం, బరువు తక్కువగా ఉండడం నెలలు నిండకుండానే ప్రసవం కావడం రక్తహీనత వల్ల ప్రసవ సమయంలో ఆక్సిజన్ సరిగా అందకపోవడం నొప్పులు సరిగా తీయలేకపోవడం ప్రసవం తర్వాత తల్లికి ప్రమాదం జరిగే అవకాశం 'ఆక్సిజన్ అందకపోవడం మజిల్ కాంట్రాక్షన్ ఆక్సిజన్ సప్లై సరిగ్గా లేకపోవడం వల్ల రక్తం ఎక్కువగా పోవడం ప్రాణాపాయ స్థితిలో వెళ్లే అవకాశాలు ఉంటాయి. ఎప్పటికప్పుడు హిమోగ్లోవిన్ శాతాన్ని పరీక్ష చేయించుకోవాలి ఆమె సూచించారు. ముఖ్యంగా ఐదు, ఏడూ, తొమ్మిది నెలల్లో, ఐదో నెల నుండి పోలిక్ యాసిడ్, ఐరన్ టాబ్లెట్లు, వాడాలి. మంచి ఆహారం తీసుకున్నప్పటికీ టాబ్లెట్లు తప్పనిసరిగా వేసుకోవాలి. ఎందుకంటే తల్లి నుండే బిడ్డకి రక్తం వెళ్తుంది. దీంతో నెలలు నిండేకొద్దీ తల్లిలో రక్తం తగ్గుతూ వస్తుంది. గర్భిణీలలో ఎంత ఆహారం తీసుకున్నప్పటికీ అది జీర్ణమై10 శాతం మాత్రమే రక్తంగా మారుతుంది. వైద్యుల సూచన మేరకు టాబ్లెట్లు తప్పనిసరిగా వేసుకోవాలి. నులిపురుగుల సమస్యతో ఎంత ఆహారం, టాబ్లెట్లు వేసుకున్నప్పటికీ రక్తం వృద్ధి చెందదు వెంటనే వైద్యులను సంప్రదించాలి. తల్లి రక్తహీనత బిడ్డ కు వస్తే కామెర్లు రావచ్చు తగిన జాగ్రత్తలు తీసుకుంటే తరచూ వైద్యుల్ని సంప్రదిస్తూ వారి సూచనలు పాటిస్తూ నిర్లక్ష్యం చేయకుండా ఉంటే సుఖ ప్రసవం జరుగుతుంది, తల్లి, బిడ్డలు ఇద్దరు క్షేమంగా ఉంటారని డాక్టర్ యమ్. స్వర్ణలక్ష్మి అన్నారు.

# 30 పోలీస్ యాక్ట్ కొనసాగింపు

## - ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 01**




శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఒంగోలు సబ్డివిజన్ పరిధిలో ఫిబ్రవరి 01 నుండి 28వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సంఘాలు, కార్మిక యూనియన్లు, రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు లేదా ధర్నాలు నిర్వహించకూడదని డిఎస్పీ స్పష్టం చేశారు. ఏదైనా కార్యాచరణ నిర్వహించాలనుకుంటే, సంబంధిత పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

## ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ ఎకనామికల్ డెవలప్మెంట్ సొసైటీ వారి వితరణ



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 01**

ఒంగోలు కబేళాబజార్ లో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన రెహ్మాన్ అనారోగ్యం బారిన పక్షవాతం తో చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజూ కూలికి వెళ్తే గాని పూట గడవని పరిస్థితి రహ్మాన్ కుటుంబానిదని గుర్తించారు. ఆ కుటుంబానికి ఏదైనా సహాయం అందించాలని సదుద్దేశంతో ప్రకాశం జిల్లా ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ ఎకనామికల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు స్పందించారు. అతని కుటుంబ సభ్యులను పిలిపించి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను, దుప్పట్లు, దుస్తులను అందజేసి మానవతను చాటారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జిల్లా ప్రెసిడెంట్ షేక్ ఖాదర్ వలి,వైస్ ప్రెసిడెంట్ ఫరూక్, టౌన్ ప్రెసిడెంట్ బాజీ, గౌరవ సలహాదారులు రిటైర్డ్ ఎస్సై ఖాసీం సాహెబ్, పాల్గొన్నారు.

# విజయలక్ష్మి సేవలు ఎంతో ప్రశంసనీయం

**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 1**

విజయలక్ష్మి సేవలు ఎంతో ప్రశంసనీయమని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చెప్పారు. ఆదివారం నాడు పొదిలి ఆర్టీసీ డిపోలో కండక్టర్ గా విధులు నిర్వర్తిం చి, పదవి విరమణ చేసిన మునగాల విజయలక్ష్మి పదవి విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ కు చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ తమ యూనియన్ కు చెందిన విజయలక్ష్మి చురుకైన నాయకు రాలుగా చెప్పారు. కండక్టర్ గా ఆమె సుదీర్ఘకాలం పనిచేయడంతో పాటు రవాణా పరంగా విశేష సేవలు అందించారని వారు కొనియాడారు. అనంతరం విజయలక్ష్మి ని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ముల్లా షరీఫ్, అధ్యక్షులు బాజీ, కె.వి రావు, షేక్ బాషా, బాబావలి, రోషన్ కుమార్, ఎస్.కె. కె. భాష, దివాకర్, కొండలరావు, ఆచారి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



# మెరుగైన వైద్య సేవలు అందించటమే ప్రభుత్వ ధ్యేయం...

## ప్రభుత్వ హోమియో వైద్యశాల నూతన భవనానికి శంకుస్థాపన

## ప్రజారోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంది -గూడూరి ఎరిక్షన్ బాబు





**పుల్లల చెరువు పెన్ పవర్ ఫిబ్రవరి 1**

పుల్లలచెరువు మండలం యంద్రపల్లి గ్రామంలో నిర్మించనున్న ప్రభుత్వ హోమియో వైద్యశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా హోమి యోపతి వైద్యానికి ప్రజల్లో ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని, ఇలాంటి వైద్యశాలల మౌలిక వసతుల అభివృద్ధి అత్యంత అవసరమని అన్నారు. నూతన భవనం నిర్మాణం పూర్తయిన అనంతరం పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ పాలనలోనే వైద్య, విద్యా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ వైద్య సంస్థలను మరింత బలోపేతం చేయడానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు. యంద్రపల్లి గ్రామంలో హోమియో వైద్యశాల భవన నిర్మాణం పూర్తయ్యేలా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో నూతన వైద్యశాల భవనం ఏర్పడడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యంద్రపల్లి సర్పంచ్ తాళ్లపల్లి సుబ్బారావు వెంకట లక్ష్మి నరసమ్మ, పుల్లల చెరువు టీడీపీ మండల అధ్యక్షులు పొట్ల గోవిందు, పుల్లల చెరువు టీడీపీ మాజీ మండల అధ్యక్షులు పయ్యావుల ప్రసాద్, రెంటపల్లి సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, హోమియో వైద్యులు యాకోబు, మెడికల్ అధికారులు, ఈ ఓపీఆర్డీ నలగాటి ఆత్మ నాయుడు, మండల నాయకులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 19 వార్డు వైకాపా కమిటీ ఎన్నిక



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 1**

మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైయస్ఆర్ సీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని 19వ వార్డు అధ్యక్షులు నాగసూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 19వ వార్డుకు సంబంధించిన వార్డు కమిటీ, అనుబంధ విభాగాలు మొత్తం కమిటీని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటలెక్చువల్ అధ్యక్షులు రావులకొల్లు బ్రహ్మానందం, రాష్ట్ర బూత్ కమిటీ జాయింట్ సెక్రెటరీ గణేశం గంగిరెడ్డి, కల్చరల్ వింగ్ అధికార ప్రతినిధి వల్లూరి కోటేశ్వరరావు, పట్టణ ఉపాధ్యక్షులు తల్లపునేని గోపి, యడ్ల మాధవరెడ్డి, కణాల శివ ప్రసాద్, సోడా రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేమన శ్రీనివాసులు రెడ్డిని అభినందించిన

### చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి.



**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 1**

ఈమధ్య విడుదలైన గ్రూప్ 2 ఫలితాలలో కనిగిరి మండలం లింగారెడ్డి పల్లి గ్రామ నివాసి వేమన శ్రీనివాసులు రెడ్డి డైరెక్టర్ ఫ్యాక్టరీ ఆదివారం ఆంధ్రప్రదేశ్ వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి వేమన శ్రీనివాసులు రెడ్డి ని అభినధించారు. అనంతరం చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇంకా మంచి ఉన్నత ఉద్యోగం సంపాదించాలి, ఇంతటితో ఆగిపోకుండా గ్రూప్ 1పోస్ట్ కూడా సాధించాలని ఆయన కోరారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తేవాలని అన్నారు. వారితోపాటు టీచర్ వెంకట్రామిరెడ్డి, మాజీ యేరువారిపల్లి ఎంపీటీసీ మరియు వైసీపీ కనిగిరి మండల నాయకులు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, శీలం రాంసత్యం రెడ్డి, చందా నర్సారెడ్డి అభినందించిన వారిలో ఉన్నారు.

## బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన దద్దాల



**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 1**

వైఎస్సార్సీపీ ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ని చీమకుర్తి వారి నివాసంలో ఆదివారం కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు విషయాలు ఇరువురు చర్చించారు. ఈ కార్యక్రమం లో గుంటక తిరుపతిరెడ్డి,మడతల కస్తూరిరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, వాకమల్ల రాజశేఖర్ రెడ్డి, డాక్టర్. ఆవుల కృష్ణారెడ్డి, చింతం శ్రీనివాసులు, మార్తాల వెంకటేశ్వర్ రెడ్డి, ద్వారశిల శేసిరెడ్డి, మిట్టా రమేష్ రెడ్డి, టి.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్జీవోల క్యాలెండర్‌ని ఆవిష్కరించిన కందుల



**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 1**

రాష్ట్ర ఎన్జీవోల సంఘం పొదిలి తాలూకా యూనిట్ క్యాలెండర్ ను మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం నాడు మార్కాపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతని ఇస్తుందన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం పొదిలి తాలూకా యూనిట్ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ఎస్ సంధాని భాష, అసోసియేట్ అధ్యక్షులు నాగూర్ వలి, ఉపాధ్యక్షులు జె. వెంకటేశ్వర్లు, కోశాధికారి విజయ, కళా ప్రపూర్ణ, శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి, పుణ్యవతి, కె. అనూష, సులోచన తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ ఆశాజనకంగా ఉంది

**దొనకొండ ఫిబ్రవరి 1 పెన్ పవర్**



మండల బిజెపి మాజీ అధ్యక్షులు రోడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ అమలు లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగిందని అందులో లో ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళల సాధికారత, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు మధ్యతరగతికి పన్ను రాయితీలు, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా ఈ బడ్జెట్ కీలకంగా ఉందని, ఐటి, ఫార్మా, బయోఫార్మా రంగాలకు ప్రోత్సాహం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూడా దోహద పడేలా ఉందని తెలియజేసారు.

## కోడిపందెంరాయుళ్లు అరెస్ట్ -కేసు నమోదు.



**గుడ్లూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 01**

కోడి పందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను గుడ్లూరు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్సై వి.వెంకట్రావు కథనం మేరకు మండలంలోని అడవిరాజుపాలెం ఫారెస్ట్ వద్ద కొంతమంది కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై వెంకట్రావు తన సిబ్బందితో కోడి పందాలు ఆడుతున్న స్థావరాల పై ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా, వారి వద్ద నుండి రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకొని, రూ.2120 నగదును జప్తు చేయడం జరిగినదని ఎస్సై వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వీరిపై కేసు నమోదు చేయడం జరిగినదని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంది

### యం. శ్రీనివాసరావు పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్.

**పామూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 01**

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఒంగోలు సబ్డివిజన్ పరిధిలో ఫిబ్రవరి 01 నుండి 28వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ యం. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సంఘాలు, కార్మిక యూనియన్లు, రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు లేదా ధర్నాలు నిర్వహించకూడదని సీఐ.యం. శ్రీనివాసరావు. తలిపారు. ఏదైనా కార్యాచరణ నిర్వహించాలనుకుంటే, సంబంధిత పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ.యం. శ్రీనివాసరావు తెలిపారు.




## హమాలి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

### - ఈనెల 12 న నిర్వహించే జాతీయ సమ్మెలో హమాలి కార్మికులు భాగస్వామ్యం కావాలి

### - ఏపీ హమాలి ముఠా ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి అంజి బాబు పిలుపు

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 01**




రాష్ట్రంలో హమాలీ సంక్షేమ బోర్డులు వెంటనే ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలని ఏపీ హమాలి ముఠా ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధంగా ఉన్న ఒంగోలు ముఠా వర్కర్స్ యూనియన్ 9వ మహాసభలు ఒంగోలులోని గోపాలనగరంలో గల కూరగాయల మార్కెట్ కమిటీ కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలకు ఒంగోలు ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కందుకూరి సుభాన్ నాయుడు అధ్యక్షత వహించారు. మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ హమాలీ ముఠా ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు హాజరై మాట్లాడుతూ హమాలి సంక్షేమ బోర్డు బిల్లును 1996లో పార్లమెంట్లో ప్రవేశపెట్టినప్పటికీ ఇప్పటివరకు అమల్లోకి రాలేదన్నారు. అనేక పర్యాయాలు పలు రూపాయల లో ఆందోళన చేపట్టినప్పటికీ ఫలితం దక్కలేదన్నారు. మహారాష్ట్ర, కేరళ ప్రభుత్వాల మాదిరి రాష్ట్రంలో కూడా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ మాట్లాడుతూ ఒంగోలు పట్టణ వర్కర్స్ యూనియన్ 1975లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన నాటి నుండి కార్మికుల హక్కులను, చట్టాలను నిర్వీర్యం చేసే దిశగా పాలన సాగిస్తుందన్నారు. 44 లేబర్ చట్టాలు, హక్కుల స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను అమల్లోకి తెచ్చారన్నారు. దీంతో కార్మికులు కట్టు బానిసలుగా మిగిలిపోయే పరిస్థితి నెలకొంది అన్నారు. కార్మికులు తమ హక్కులను, చట్టాలను పరిరక్షించుకునేందుకు ఈనెల 12న జరిగే జాతీయస్థాయి సమ్మెలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, మర్చంట్ అసోసియేషన్ జిల్లా నాయకులు దేసు వెంకటేశ్వర్లు, బలస సురేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. నూతన కార్యవర్గం ఎన్నిక ఈ సందర్భంగా ఒంగోలు పట్టణ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎస్ డి సర్దార్, గౌరవ సలహాదారులుగా కొత్తకోట వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా కందుకూరి సుభాన్ నాయుడు, ప్రసాద్ కార్యదర్శిగా సిహెచ్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ గా వేములపాటి వెంకట్రావు, బొడ్డపాటి సుబ్బారావు, కొదమల ఆనంద్, అమర శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా ఆనాటి వెంకటేశ్వర్లు, పెరుగు గంగయ్య, ఉమ్మన బోయిన భద్ర, బుసిరెడ్డి శ్రీను, పిన్ని బోయిన రమణయ్య, వెంకట కొండయ్య మరికొందరితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మౌలిక-సంక్షేమ రంగాలకు పెద్ద పీటవేసిన 2026-27 కేంద్ర బడ్జెట్ -ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 1**



వికసిత్ భారత్ 2047 విజన్ కు అనుగుణంగా నేడు లోక్ సభలో కేంద్ర ఆర్థిక మంత్రి, నిర్మలా సీతారామన్ రూ.53.47 లక్షల కోట్లతో 9 సారి ప్రవేశపెట్టిన 2026-27 పూర్తి స్థాయి బడ్జెటులో 3 కర్తవ్యాల రూపకల్పనతో మౌలిక మరియు సంక్షేమ రంగాలకు పెద్దపీట వేశారని ఇది జనరంజకమైన బడ్జెటు అని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పేర్కొన్నారు మౌలిక సదుపాయాలకు రూ.12.2 లక్షల కోట్లు, గ్రామీణాభివృద్ధి రూ.2.73,108 కోట్లు, వ్యవసాయం -- అనుబంద రంగాలకు రూ. 1.62,671 కోట్లు, విద్య -- నైపుణ్యాభివృద్ధికి రూ.1.39,289 కోట్లు, ఆరోగ్యం - వైద్యానికి రూ. 1,04,599 కోట్లు, రక్షణకు రూ. 5,94,585 కోట్లు, హోంకు రూ.2,55,234/- కోట్లు, విద్యుత్ కు రూ. 1,09,029 కోట్లు, రవాణాకు రూ. 5,98,520 కోట్లు, పట్టణాలకు కోట్లు, రూ.85,522 కోట్లు, వాణిధ్యానికి రూ. 70,296 కోట్లు, సంక్షేమానికి రూ.62,362 కోట్లు, ఐ.టి.-- టెలికంకు రూ.74,560 కోట్లు మరియు తదితర అన్ని రంగాలకు కూడా సముచితంగా నిధులు కేటాయింపులు చేశారని పేర్కొన్నారు. ఏ.పి.లో మినరల్ కారిడార్, బెంగాల్ నుండి గుజరాత్ వరకు రవాణా సదుపాయ కారిడార్, 3 కెమికల్ రీచర్చ్ పార్కులు, టెక్స్ టైల్స్ పార్కులు, 20 జలమార్గాల అభివృద్ధి, 7 నగరాల మధ్య హైస్పీడ్ రైళ్ళు, 3 ఆయుర్వేద ఎయిమ్స్ వైద్యశాలలు, ప్రతి జిల్లాలో బాలికలకు హాస్టళ్ళు, 2 హైటెక్ ఔషద విద్య సెంటర్లు, 5 వేల విధ్యుత్ బస్సులు, విదేశీ ఆస్తుల తప్పనిసరి వెల్లడి, పన్నుల పరిధిలోకి మానవ వనరుల సరఫరా సంస్థలు, కార్పోరేట్ కొనుగోళ్ళపై పన్ను పెంపుదల, 500 చేపల సరస్సులు, విధ్యాసంస్థలలో లాబ్స్, జరిమానా చెల్లించే వారికి శిక్ష మినహాయింపు, వ్యక్తిగత ఆదాయ పన్ను యదాతథం, 15 పురావస్తు కేంద్రాల అభివృద్ధి, డేటా సెంటర్లకు పన్ను మినహాయింపు, రాష్ట్రాలకు రూ.1.4 లక్షల కోట్లు కేటాయింపు మరియు అధిక వస్తువులకు పన్నులు తగ్గింపు బడ్జెటులోని కొన్ని ముఖ్యాంశాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కు విభజనలోటులోని ఆంధ్ర ప్రదేశ్ వినతిని మన్నించి, పోలవరానికి రూ.3,320 కోట్లు, అమరావతికి రూ.1,129 కోట్లతోపాటు తదితర పనులకు నిధులు కేటాయించి, సమతుల్య బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు ఆర్థిక మంత్రి, నిర్మలా సీతారామన్కు, ప్రధాన మంత్రి, గ నరేంద్ర మోదీకి,రాష్ట్ర ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## వైయస్ షర్మిలా రెడ్డి ఉపాధి హామీ పరిరక్షణ యాత్రకి రాష్ట్ర అసంఘటిత కార్మికుల ఉద్యోగుల చైర్మన్ కైపు వెంకటకృష్ణారెడ్డి



**దర్శి ఫిబ్రవరి 1 పెన్ పవర్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ నేతృత్వంలో జాతీయ ఉపాధి హామీ ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఏ చట్టానికి బీజం పడింది రాష్ట్రంలోనే మహానేత ఒత్తిడితో 2006 లో ఉపాధికి శ్రీకారం చుట్టింది ఏపీలోనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సారథ్యంలో నరేగా చట్టం ఆనాడు రాష్ట్రంలో అద్భుత విజయం పనికి ఆహార పథకం అమలులో అప్పుడు వైఎస్ఆర్ పాలన దేశానికే ఆదర్శం కరువు పని సక్సెస్ లో నాడు ఏపీ రోల్ మోడల్ ఉమ్మడి రాష్ట్ర గ్రామీణ ప్రాంత అభివృద్ధికి, బ్రతుకు జీవనాన్ని గ్యారెంటీ చేయడానికి వలసలు నివారించి పేదల కొనుగోలు శక్తి పెంచడానికి, వ్యవసాయానికి సాయంగా వైఎస్ఆర్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి ఆశయాలకు ఊతం ఇచ్చిందే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి పుట్టినిల్లు ఆంధ్రప్రదేశ్, ఇప్పుడు ఈ పథకాని బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తున సందర్భంగా, ఏఐసీసీ పిలుపు మేరకు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ఆశయ సాధనను కాపాడేందుకు ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అంతా భారీ ఎత్తున నిరసనలకు శ్రీకారం,అన్ని జిల్లాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ఈ కార్యక్రమంలో నన్ను భాగస్వామ్యం చేసినందుకు వైయస్ షర్మిలా రెడ్డి కి ధన్యవాదాలు.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి యం. యల్. నారాయణ**



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 01**

2025 26 బడ్జెట్లో మొత్తం వ్యయం రూ 50, 65,345 కోట్లుగా ప్రకటించి సవరించిన అంచనాలలో అదే రూ 49,64,842 కోట్లకు తగ్గించి ఇప్పుడు మళ్లీ రూ 53,47,315 కోట్లు ఘనంగా ప్రకటించారని ఇది పేద ప్రజలను అంకెల గారడి తో మోసగించడమేనని సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి యం. యల్. నారాయణ విమర్శించారు. ఆదివారం ఆయన కేంద్ర బడ్జెట్ పై ఒక ప్రకటన విడుదల చేశారు. ఉభయ రాష్ట్రాలకు అతిపెద్ద బహుళార్థక జాతీయ పోలవరం ప్రాజెక్టును ఈ బడ్జెట్లో నిధులు తక్కువగా కేటాయించి పోలవరం ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేశారని పేర్కొన్నారు. జాతీయ ప్రాజెక్టు కు త్యాగం చేసిన పోలవరం, వెలిగొండ తదితర ప్రాజెక్టు నిర్వాసితులకు నిధులు కేటాయించడంలో తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ బడ్జట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసగించే బడ్జట్ అని విమర్శించారు.

# వైసీపీ నాయకులు పద్ధతిగా మాట్లాడడం నేర్చుకోవాలి

**తెలుగుదేశం నాయకులు దాసరి వెంకటేశ్వర్లు**



**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 1**

వైసీపీ నాయకులు పద్ధ తిగా మాట్లాడడం నేర్చుకో వాలని తెలుగుదేశం ఒంగోలు పార్లమెంటు అధి కార ప్రతినిధి దాసరి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నాడు ఆయన మర్రిపూడి లో మాట్లాడుతూ అంబటి రాంబాబు మాట్లాడిన తీరు ను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో వైసీపీ నేతల భాషతో పాటు సంస్కృతి దిగజారి పోతుందని ఆయ న విమర్శించారు. రాష్ట్ర మంత్రిగా పనిచేసిన వైసీపీ నేత అంబటి రాంబాబు మాట్లాడిన తీరు ఎంతో ఆక్షేపనీయమన్నారు. ఇటువంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండటం రాష్ట్రానికే అవమానకరమని వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విమర్శలు చేయడం సహేతుకంగా ఉండాలి తప్ప, బూతు పదాలు వాడటం మంచి పద్ధతి కాదన్నారు. వైసీపీ నేతలు తమ భాషను మార్చుకోవాలని, లేకుంటే ప్రజలే వారిని శిక్షిస్తారని వెంకటేశ్వర్లు చెప్పారు.

# అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి సేవాసధన్ ఆర్థికసాయం.



**గుడ్లూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 01:**

మండలంలోని రాళ్ళపాడు గ్రామానికి చెందిన తలతోటి మదన్ కుమార్ గత ఐదేళ్లుగా రెండు కాళ్ళు రెండు చేతులు పక్షవాతానికి గురై కనీసం అన్నం తినడానికి కూడా చేతిని నోటిదాకా లేపలేని స్థితి లో మంచానికే పరిమితమై ఉన్నాడు . తన తల్లే బిడ్డకు నోటిలో పెట్టి తినిపిస్తూ అన్నీ సేవలు చేస్తూ ఉండేది. అయితే గత కొన్నిరోజులుగా తల్లి కూడా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ అవస్థలు పడుతూ ఉంది. వైద్యం చేయించుకోవాలని లేకపోతే ప్రాణానికే ప్రమాదమని వైద్యులు సూచించారు. కానీ వైద్యానికి సరిపడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న కుటుంబం గురించి గ్రామస్తుల ద్వారా విషయాన్ని తెలుసుకొని సేవాసదన్ రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి మాల్యాద్రి రాష్ట్ర సహాయ కార్యదర్శి కట్టా ఏసునాధంతో కలిసి కుటుంబానికి సాయం చేయడానికి ముందుకు వచ్చి వెంటనే సాయంగా 5000 రూపాయలు నగదును ఆదివారం అందజేశారు. క్రియాశీలక సభ్యులుగా ఎం.శ్రావణ్ బోస్, జీ.లక్ష్మీ నారాయణ, గుంటూరు జిల్లా అధ్యక్షులు సీహెచ్.పెదలక్ష్మయ, టీ.అమర్ బాషా, తులసి యోగేంద్ర, డీ.అక్కలక్ష్మీ, ఎన్.ప్రమీలాదేవి, సీహెచ్ సుజాత, సీతామహాలక్ష్మి, టీ.కృష్ణవేణి, కే.శిరీష, జీ.అరుణకుమారి క్రియా శీలక వ్యక్తులుగా ఉన్నారు. సేవలో పాల్గొన్న సేవా సదన్ సభ్యులశీదరికీ అధ్యక్షులు మాల్యాద్రి ధన్యవాదాలు తెలియజేశారు. సేవకు సహకరించే దయాహృదయులు 8008879691 కు ఫోన్ పే చేయగలరని మనవి చేశారు.

# మిట్టపాలెం నారాయణస్వామికి భక్తులు పూజలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 1**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.దేవస్థాన ప్రధాన అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ స్వామివారి మూలవిరాట్ ను వివిధ రకాల పూలమాలలతో అలంకరించి పంచామృత అభిషేకం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ అభిషేకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆలయ ఆవరణలోని గోశాలలో గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించి గోవుల ప్రాధాన్యతను భక్తులకు వివరించారు.భక్తులు మహా నైవేద్యాన్ని గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించారు భక్తులు స్వామివారి దర్శనానంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు క్రమశిక్షణతో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఉదయము నుంచి రాత్రి వరకు కొనసాగిన ప్రత్యేక సేవలతో ఆలయ వాతావరణం భక్తిమయంగా మారింది. రాత్రి వేళ నారాయణస్వామికి పల్లకీ సేవ, రథోత్సవం



నిర్వహించగా, ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నారాయణస్వామి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆలయ సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు చేసి క్యూలైన్లు



తాగునీరు ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ భక్తులకు సహకరించారు ఈ కార్యక్రమాలతో నారాయణస్వామి దేవస్థానం ఆదివారం రోజు అంతా భక్తుల నారాయణస్వామి నామస్మరణతో మర్మోగింది ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థాన కమిటీ సభ్యులు పాలపర్తి నారాయణరావు, పోకల మాల్యాద్రి ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేద కుటుంబాలకూ వరం

**టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు**



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 1**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్నవారికి సీఎం సహాయనిధి ఓ వరమని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. నియోజకవర్గంలొ అనారోగ్యం కారణంగా వైద్యం చేయించుకున్నవారికి సి యం సహాయ నిధి ద్వారా 55మంది లబ్ధిదారులకు 56,25,929 లక్షల రూపాయలచెక్కులను పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జీవనం కొనసాగిస్తున్న, కుటుంబాలకు ఆరోగ్య పరమైన అనారోగ్య సమస్యలు వస్తే, ఆర్థికపరమైనఇబ్బందులు ఎదుర్కొంటారని, అటువంటి వారికి సియం సహాయనిది ఆపద్బబంధువుని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎవరు అనారోగ్య సమస్యలతో బాధ పడకూడదని వైద్య రంగానికి పెద్ద పీట వేశారని, ఆసుపత్రులలో వర్తించని వాటికి సియంసహాయనిది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లొ పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున, మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి,నాయకులు చేకూరి సుబ్బారావు, వేగినాటి శ్రీనివాస్, గోళ్ళ సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ కూటమి నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

# మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్టు అక్రమం

**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 1**



వైయస్ఆర్సీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా కెపిహెచ్బి టెంపుల్ బస్ స్టాప్ లో ప్లకార్డులు పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రకాశం జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు దొండేటి నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్,ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటి పర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ తిరుమల లడ్డు కల్తీ అయిందని విష ప్రచారం చేసిన కూటమినేతలు,సిబిఐ దర్యాప్తులో కల్తీ నెయ్యి అనేది కేవలం ప్రచారం మాత్రమేనని తిరుమల లడ్డులో కల్తీ లేదని నిగ్గు తేల్చడంతో చివరికి కూటమి సర్కార్ ఫ్లెక్సీల ప్రచారాన్ని తెరపైకి తీసుకువచ్చి డైవర్షన్ పాలిటిక్స్ కి తెర లేపారని అన్నారు.ఆ ఫ్లెక్సీలను తీసే కార్యక్రమంలో ప్రభుత్వం తమదేవుందని ధైర్యంతో ఆటవికంగా అంబటి రాంబాబు ఇంటిపై దాడులు చేశారని ఎమ్మెల్యే ధ్వజం ఎత్తారు. తిరుమల లడ్డు కల్తీ అయిందని దేవాలయం మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ ఈరోజు ఏ దేవాలయం మెట్లు కడుగుతారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో కూటమి సర్కార్ కి బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ విభాగం ఉపాధ్యక్షులు మందపాటి హరీష్ రెడ్డి,రాష్ట్ర ఐటీ విభాగం ఉపాధ్యక్షులు ఎద్దుల జనార్ధన్ రెడ్డి, ప్రకాశం జిల్లా ఐటీ వింగ్ నాయకులు పాల్గొన్నారు.

# చీడ పురుగు అంబటి చంద్రబాబుకు క్షమాపణ చెప్పాలి

**– కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా ప్రభాకర్ డిమాండ్**



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 01**

డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా వైసిపి నాయకుడు అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని పరుష పదజాలంతో దూషించడం చీడ పురుగు అంబటి రాంబాబు తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, అంబటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి క్షమాపణ చెప్పాలని కాపు ఉద్యమ నాయకుడు కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబటి రాంబాబు లాంటి చీడ పురుగు మాట్లాడిన విధానానికి కాపు జాతి సిగ్గు తలదించుకునే విధంగా ఉన్నది. వైకాపా ప్రభుత్వంలో ఇలాంటి చర్యలకు పాల్పడితే నే రాష్ట్ర ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా రాకుండా తీర్పు ఇచ్చారని అయినా సిగ్గు రాలేదని తీవ్రంగా మండిపడ్డారు.రాబోయే 2029 ఎన్నికల్లో ప్రజలు వైసిపిని కనీసం ఒక ఓటు శాతం కూడా లేకుండా ఎలక్షన్ కమిషన్ వైసిపి పార్టీ రద్దు చేసే విధంగా ప్రజలు తీర్పు ఇస్తారని విమర్శించారు. కాపులు చంద్రబాబు వెంట ఉన్నారని భవిష్యత్తులో కూడా ఉంటారని కోలా ప్రభాకర్ స్పష్టం చేశారు.

**తెలుగుదేశం పార్టీ ..:** నగర అధ్యక్షులు బండారు మదన్ మాట్లాడుతూ నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడు గురించి ఆయన తల్లి గురించి సభ్య సమాజం తలదించుకునే విధంగా అంబటి రాంబాబు మాట్లాడడం చాలా బాధగా అనిపిస్తుందని అన్నారు. సిగ్గు లజ్జ లేని అన్ని విడిచేసిన అటు ఇటు కాని వ్యక్తి అంబటి రాంబాబు అని తీవ్రంగా విమర్శించారు. వైసీపీ నాయకులకు డైవర్షన్ పాలిటిక్స్ కొత్తేమీ కాదు అన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాపు నాయకులు బేతంశెట్టి హరిబాబు, తోటకూర వెంకట్రావు, వరదా నరసింహారావు, దాసరి సుబ్బారావు, కాపు నాయకులు, పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆకుపాటి



**పామూరు , పెన్ పవర్, ఫిబ్రవరి 1**

ఉమ్మడి ఉభయ ఉభయగోదావరి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించిన ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు, కాపు యువ నాయకులు ఆకుపాటి వెంకటేష్. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# క్రికెట్ విజేతలకు మెమెంటో అందచేసిన గంగసాని హుస్సేన్ రెడ్డి.






**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 1,**

బెంగళూరులో జరిగిన నాగ్నస్ ఎస్ ఎఫ్ ఎల్ క్లబ్ వారు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ పాంథర్స్ మరియు ఆర్ సి బి జట్ల మధ్య ఆదివారం మ్యాచ్ ఉత్కంఠభరితంగా జరిగింది. ఈ హోరాహోరీ పోరులో పాంథర్స్ జట్టు 30 పరుగుల తేడాతో ఆర్ సి బి జట్టును ఓడించి ఛాంపియన్గా నిలిచారు.

**ఆర్ సి బి జట్టు రన్నరప్గా నిలిచింది.**

ఈ విజయంలో కీలక పాత్ర పోషిస్తూ హుస్సేన్ రెడ్డి రెండవ కుమారుడు యతీంద్ర రెడ్డి అద్భుతమైన బౌలింగ్తో 3 కీలక వికెట్లు తీసి మ్యాచ్ను పాంథర్స్ జట్టు వైపు తిప్పి గెలిపించారు. టోర్నమెంట్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పామూరు మండల వైసీపీ పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి గెలిచిన టీమ్ కి బహుమతులు అందించారు.

# మానవత్వం చాటుకున్న బీసీ సంక్షేమ సంఘం మరియు శాలివాహన సంఘం.





**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 1**

కనిగిరి పట్టణ సమీపంలోని పాతూరు కు చెందిన కూడూరి శ్రీనివాసులు, లక్ష్మీ ప్రసన్నా ల రెండో కుమారుడు మూడవ తరగతి చదువుతున్న అక్షయ్ 9సం. ఓ ఇంటి మేడపై ఆడుకుంటూ ప్రధాన కరెంటు తీగలు తగలడంతో విద్యుత్ ఘాతకానికి గురై రెండు చేతులు కాలిపోయి ఇన్ఫెక్షన్ సోకటంతో రెండు చేతులు భుజం వరకు తొలగించారు. కాలు ఫ్యాక్చర్ అయ్యి ప్రాణాపాయ స్థితిలో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్చారు. తల్లిదండ్రులు అప్పులు చేసి వైద్యానికి 15 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం చేతిలో చిన్ని గవ్వలేక కుమారుని ఎలా రక్షించుకోవాలో తెలియక కనిగిరి నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం, మరియు శాలివాహన సంఘాలను కోరగా విరాళాలు సేకరించి దాతల సహకారంతో రూ.1,20,248 లు సేకరించి ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో సంఘ నాయకులు కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, మున్సిపల్ చైర్మన్ షేక్. అబ్దుల్ గఫార్ చేతులు మీదుగా కూడూరి అక్షయ్ కుమార్ తల్లిదండ్రులకు నగదును అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్. నాయబ్ రసూల్, ఈర్ల విజయరామరాజు, కోశాధికారి పట్నం నరసింహం, శాలివాహన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కొర్రపాటి ఓబులేసు, బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు దేవరాజు గట్టు శివ, కాశయ్య, బొప్పరాజు సుబ్బారావు, రజక సంఘం అధ్యక్షులు ఉప్పలపాటి కొండయ్య, కలికాయి నారాయణ, ఎలవర్తి చిరంజీవి, చిర్లదిన్నె మాధవ, మాలపాటి సంజీవ్, పొట్టేళ్ల మాలకొండయ్య, కోమటిగుంట్ల బాబురావు, కలగండ్ల గురు ప్రసాద్, కలవకూరి వెంకటేశ్వర్లు, చింతలపూడి తిరుపాలు, మొదలగువారు పాల్గొన్నారు. వారితోపాటు డీఎస్పీ తో పాటు కనిగిరి సీఐ ఉప్పుటూరి శ్రీనివాసులు, హెచ్.యం.పాడు ఎస్ఐ. మాధవరావు లు ఉన్నారు.

# మేదరమెట్ల నడిరోడ్డుపై మద్యం బాబుల రభస

**పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ ఇచ్చిన ఎస్.ఐ మహమ్మద్.రఫీ**



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, ఫిబ్రవరి 1**

కొరిశపాడు మండలం, మేదరమెట్లలో ఆదివారం మధ్యాహ్నం మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. గ్రామానికి చెందిన చింతకుంట్ల. రాజేష్, పేరం. అనిల్, చిరంజీవి అనే స్నేహితులు మద్యం షాపులో మద్యం సేవించి, మత్తులో ఒకరితో ఒకరు గొడవపడ్డారు. ఈ క్రమంలో నడిరోడ్డుపైకి వచ్చి ఒకరినొకరు కొట్టుకోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న మేదరమెట్ల ఎస్.ఐ మహమ్మద్. రఫీ వెంటనే స్పందించి ఆ యువకులను పోలీస్ స్టేషన్కు పిలిపించారు. బహిరంగ ప్రదేశాల్లో గొడవలు పడి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

# రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర బడ్జెట్ ఊతం

## - కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు - ఎమ్మెల్యే దామచర్ల

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 01**



దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, స్వర్ణాంధ్ర సృష్టికర్త రాష్ట్ర ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు కి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కృతజ్ఞతలు తెలియజేశారు.

విభజన లోటు లోని ఆంధ్రప్రదేశ్ వినతిని మన్నించి, పోలవరానికి రూ.3,320 కోట్లు, అమరావతికి రూ.1,129 కోట్లతోపాటు తదితర పనులకు నిధులు కేటాయించి, సమతుల్య బడ్జెట్ కేటాయించారని తెలిపారు. బడ్జెట్ తో ఏపీకి గణనీయమైన మేలు జరగనుందని, 7 నగరాల మధ్య హైస్పీడ్ రైళ్ళు అనుసంధానం, 2047 వరకు డేటా సెంటర్లకు పన్ను ప్రోత్సాహకాలు ఎలక్ట్రానిక్ రంగానికి మరింత ఊతం ఇస్తుందని తెలిపారు. ఏ.పి.లో మినరల్ కారిడార్ ద్వారా ఏపీ కీ మరింత లబ్ది చేకూరుతుందని బడ్జెట్ ను సమర్థవంతంగా వినియోగించుకుని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి శక్తినివ్వడం కోసం కృషి చేస్తున్న నిర్మలా సీతారామన్ కి ఎమ్మెల్యే దామచర్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# క్యాటరింగ్ అసోసియేషన్ ఫెడరేషన్ ఆఫ్ ఒంగోలు నూతన కార్యవర్గం ఎన్నిక - అట్టహాసంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 01**



క్యాటరింగ్ అసోసియేషన్ ఫెడరేషన్ ఆఫ్ ఒంగోల్ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం బచ్చల బాలయ్య సంజీవమ్మ కళ్యాణ మండపంలో ఘనంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగినది. జెమిని శ్రీనివాస్ గౌరవాధ్యక్షులుగా ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించి కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. తొలుత జిల్లా సెక్రెటరీ ఆర్య భవన్ సుబ్రహ్మణ్యం ప్రారంభ ఉపన్యాసం చేసి అందరం ఒకరికొకరు సహకరించుకొని రాష్ట్రానికి పేరు తేవాలని కోరారు. గౌరవ అధ్యక్షులు అన్నం శ్రీను, జిల్లా ప్రెసిడెంట్ పమిడి చంద్రశేఖర్ మాట్లాడుతూ మా సహకారం ఒంగోలు క్యాటరింగ్ అసోసియేషన్ వారికి ఉంటాయని, అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తామని తెలిపారు. ట్రెజరర్ వల్లంశెట్టి నాగరాజు, వర్మాస్ తమ్మి రాజు (చిన్న) అందరం ప్రభుత్వ కార్యక్రమాలకి ప్రజలకి మంచి ఆహారాన్ని అందించి పేరు తెచ్చుకోవాలని కోరారు. ట్రెజరర్ వల్లంశెట్టి నాగరాజు రాష్ట్రంలో జిల్లాకి ఒంగోలు పట్టణానికి అదేవిధంగా మనకి ఆర్డర్లు ఇచ్చే ప్రజలకి మంచి ఆహారాన్ని తయారుచేసి టైంకి పంపించే విధంగా ఉండాలని సభ్యులందరినీ కోరారు. తదుపరి ఒంగోలు క్యాటరింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా ఎం. శ్రీనివాసరావు, సెక్రటరీ నంగనం శివయ్య, ట్రెజరర్ బట్టి వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టి సుబ్రహ్మణ్యం, వైస్ ప్రెసిడెంట్ మాలే గంగిరెడ్డి, కార్యవర్గ సభ్యులు సుంకర రాదేష్, ఆర్కే కిషోర్, జాయింట్ సెక్రెటరీగా పువ్వాడ వెంకట సురేష్, బొంతల అర్జున్ బాబు, సొప్ప శివకుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా అప్పల వీర వెంకట సాయిరాం, పీక రమేష్, పాటిబండ్ల సుధాకర్, బత్తుల శీను, మాస్టర్ కార్తీక్ ల చేత కామేపల్లి శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన లైఫ్ మెంబర్లను, స్పాన్సర్స్ కు ఒంగోలు అసోసియేషన్ వారు ఘనంగా సత్కరించారు. వీరిలో మూర్తి స్వీట్స్ , అల్లూరయ్య స్వీట్స్, పాలు పెరుగు హరిబాబు, సీజన్స్ 4 ఐస్ క్రీమ్ వారికి, కూరగాయల సుబ్బారెడ్డి ఎల్ఈడి కౌంటర్స్ శెట్టి శ్రీనివాస్, ఎనిబర వెల్సన్, సుధాకర్, కిల్లి నరేంద్ర, ఆదర్శ హోటల్ నారాయణ తదితరులకు వల్లంశెట్టి నాగరాజు ఘనంగా సన్మానించి షీల్డ్ బహుకరించారు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కోటి మాస్టారు తన సహాయాన్ని అందించి కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ మూతిని శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను, ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీలను వచ్చే విధంగా ప్రయత్నించి ఇల్లు లేని వారికి ఇళ్ళను గవర్నమెంట్ ఇచ్చే రెండు సెంట్లు స్థలాన్ని మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి ల దృష్టికి తీసుకుని వెళ్దామని తెలిపారు.

# బైక్ ప్రమాదాని గురైన వ్యక్తికి ఆర్థిక సహాయం అందజేత



**పీసీపల్లి పెన్ పవర్, ఫిబ్రవరి 1**

పెద అలవలపాడు గ్రామనికి చెందిన జనసేన సైనికుడు వెంకట్రావు ఇటీవల బైక్ ప్రమాదానికి గురై మంచానికే పరిమితం అయ్యాడు. విషయం తెలుసుకున్న జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు మాదాసు రమేష్ ఆదివారం అతన్ని కలిసి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వెంకట్రావు కు ఆర్థిక సహాయంగా 10 వేల రూపాయలను ఆయన అందజేశారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బండారు రాజు నిత్యవసర సరుకులు అందజేశారు . ఈ కార్యక్రమంలో కనిగిరి గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ సభ్యులు అక్బర్ , కూడల నాగేష్ , అంజినాయుడు , వెంగలరావు, బత్తుల నవీన్.కార్తీక్, దాసరి అయ్యప్ప , రమణ మనోజ్ , ఉప్పలపాటి రామాంజనేయులు , కూడలా శివ పాల్గొన్నారు.

# మాజీ మంత్రులు అంబటి, జోగి నివాసాలపై దాడి అత్యంత హేయనీయం - దద్దాల

**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 1**



మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై తెలుగుదేశం మూకలు జరిపిన దాడి అత్యంత హేయనీయమని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం సాయంత్రం కనిగిరి స్థానిక పార్టీ కార్యాలయం నుండి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ పోలీసులు చూస్తుండగానే పక్కా ప్రణాళిక ప్రకారం మాజీమంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై టీడీపీ గూండాలు దాడి చేసి విధ్వంసం సృష్టించారని, రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా, ఇది ప్రజాస్వామ్యమా ఆటవిక పాలనా అని ఆయన ప్రశ్నించారు. మాజీ మంత్రులకే రక్షణ లేని పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రాన్ని హింసకు కేరాఫ్ గా మార్చారని దుయ్యబట్టారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమని, కానీ వ్యక్తిగత దాడులకు దిగడం, ఇళ్లపై పడి విధ్వంసం సృష్టించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఆయన పేర్కొన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో కూటమి నేతలు చేసిన దుష్ప్రచారం ప్రజలకు తెలిసిపోయింది. కాబట్టి డైవర్షన్లో భాగంగా కాపు నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు లపై హత్యా యత్నం,అరెస్టు టీడీపీ పాల్పడింది అన్నారు. ఇది చాలా దుర్మార్గం, తప్పకుండా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయని, ఇది ముమ్మాటికీ కక్షసాధింపు చర్యేనని దద్దాల నారాయణ యాదవ్ మండిపడ్డారు.అధికారం శాశ్వతం కాదని,మీ దుర్మార్గ పాలన ఎల్లకాలం సాగదని గుర్తు పెట్టుకోవాలని దద్దాల నారాయణ యాదవ్ హెచ్చరించారు.

# ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలి

**డిడిఓ కె. శ్రీనివాసులు రెడ్డి**

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 1**

మార్కాపురం జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఇచ్చిన సూచనల మేరకు మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని కనిగిరి డివిజన్ డిడిఓ మరియు మండల స్పెషల్ ఆఫీసర్ కె. శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కార్యక్రమంలో సమర్థవంతంగా అమలు చేయాలని ఇంటింటి ప్రచారం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అక్షర ఆంధ్ర కార్యక్రమం అక్షరాస్యతను పెంపొందించుటకు అలాగే యూఎఫ్ఎస్ సర్వే, అక్షర ఆంధ్ర, ఈ-కెవైసీ, బయోమెట్రిక్ హాజరు నవీకరణ, లీవ్స్ దరఖాస్తులను హెస్ఆర్ఎంఎస్ఎస్ వెబ్సైట్ ద్వారా తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు, ఎస్ జి ఎస్ డబ్ల్యూ సిబ్బంది మరియు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేలను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలన్నారు.బయోమెట్రిక్ హాజరు ఆధారంగానే జీతం చెల్లింపు జరుగుతుందని స్పష్టం చేశారు సర్వేలు పూర్తి చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని, సర్వేలు పూర్తి చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన పై అధికారుల ఆదేశాల మేరకు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు ప్రతి శాఖాధికారి బాధ్యతతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

# గ్రామస్థాయి నుండి వైఎస్ఆర్సిపి పార్టీ బలోపేతం చేయాలి



**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఫిబ్రవరి 1**

గ్రామస్థాయిలో వైఎస్ఆర్సిపి మరింత బలోపేతానికి చేసేందుకు పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని వై చర్లపల్లి యర్రగొండపాలెం శాసనసభ్యులు , వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ గారి ఆదేశాలు మేరకు గ్రామస్థాయిలో వైస్సార్సీపీ పార్టీని మరింత బలోపేతం చేయుటకు గ్రామ కమిటీల నియామక కార్యక్రమంలో భాగంగా వైస్సార్సీపీ నాయకులు పర్యటించారు ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి,గ్రామస్థాయిలో పార్టీని మరింత బలంగా నిలబెట్టే విధంగా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.పార్టీ బలోపేతంలో ప్రతి కార్యకర్త పాత్ర అత్యంత కీలకమని,గ్రామస్థాయి నుంచి ప్రజలతో బలమైన అనుబంధం పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.అదేవిధంగా వై చర్లపల్లి సంబంధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు నిర్మాణాన్ని వివరించారు. పార్టీని మరింత పటిష్టం చేస్తూ,భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు అల్లు రాంభూపాల్ రెడ్డి. బాలరాజు. వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సి ఎస్ పురం జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు నూతన స్టేజీ ఏర్పాటు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 1**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని పలువురు ప్రశంచించారు 1980 నుంచి 1990 సంవత్సరాల మధ్య ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మరియు పూర్వ విద్యార్థుల మేనేజ్మెంట్ సహాయ సహకారాలతో పాఠశాల ఆవరణలో నూతన స్టేజీ ఏర్పాటు చేసినట్లు పాఠశాల పూర్వ విద్యార్థుల కోఆర్డినేటర్ ఎం. చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాసం జరిగిన విద్యాసంస్థ అభివృద్ధి పట్ల బాధ్యతగా భావించి ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయ పండుగల వేడుకలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన స్టేజీ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే ప్రతిరోజూ పాఠశాలకు సైకిళ్లపై వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ స్టాండ్ ను త్వరలో ఏర్పాటు చేయుటకు సన్నహాలు చేస్తున్నామని ఓ ప్రకటనలో తెలిపారు భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల అవసరాల అనుగుణంగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందిస్తారని తెలిపారు ఈ కార్యక్రమానికి సహకరించిన పూర్వ విద్యార్థులు మరియు మేనేజ్మెంట్ సభ్యులు పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు పూర్వ విద్యార్థుల సేవా భావం పాఠశాల అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# కారు దగ్ధం

**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 1**

గిద్దలూరు పట్టణంలోని విశ్వ భారతి స్కూల్ సమీపంలో ఓ ఇండిగో కారు దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు కారు సమీపంలోని చెత్తను తగలబెట్టడంతో కారుకు మంటలు అంటుకొని దావాలంగ వ్యాప్తి చెందాయి. స్థానికులు గమనించి వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను ఆర్పి వేశారు. కారు దగ్ధం అవ్వడం వల్ల తనకు రూ.2,50,000 లక్షలు ఆర్థికంగా నష్టపోయినట్లు కారు యజమాని సయ్యద్ సైఫుల్ల తెలుపుతూ ఆవేదన వ్యక్తం చేశారు.





# తెలుగుదేశం పార్టీ ఐటిడిపి అధ్యక్షులుగా శ్రీకాంత్


**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 1**

మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఐ టి డి పి అసెంబ్లీ అధ్యక్షులుగా గిద్దలూరు శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నాడు అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. సమస్త యువత పనితీరులో చురుకైన పాత్ర, యువతతో బలమైన అనుబంధాన్ని పరిగణలోకి తీసుకొని ఈ బాధ్యతను ఆయనకు అప్పగించినట్లు పార్టీ వెల్లడించింది. ఈ సందర్భంగా మార్కాపురం శాసనసభ్యులు కందులు నారాయణరెడ్డి, యువ నాయకులు కందుల విగ్నేష్ రెడ్డి తదితరులు శ్రీకాంత్ గారికి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకుని వెళ్లాలని సూచించారు.



# ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ - సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 01**



కేంద్ర బడ్జెట్ పేద ప్రజల ఆశలను అడియాసలు చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు విమర్శలు చేశారు.ఆదివారం నాడు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందిస్తూ ఇది విదేశీ - కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్ అని, ప్రజా వ్యతిరేక బడ్జెట్ గా రూపొందించినట్లు విమర్శించారు. విభజన చట్టం ప్రకారం రావాల్సిన హామీలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, జాతీయ విద్యా సంస్థలకు కేటాయింపులు లేవని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటి, యూనివర్సిటీ నిర్మాణం, రామాయపట్నం పోర్టు, రాజధాని నిర్మాణంపై స్పష్టత లేదన్నారు. ప్రపంచ బ్యాంకు రుణాన్నే మళ్లీ ప్రస్తావించారని, రాష్ట్ర విజ్ఞప్తులను, ప్రజల ఆకాంక్షలను కేంద్రం విస్మరించిందన్నారు.ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చినా, బడ్జెట్లో కేటాయింపుల ఊసే లేదని, రామాయపట్నం పోర్టు, ట్రిపుల్ ఐటి, ఆంధ్ర కేసరి యూనివర్సిటీ తదితర అంశాల ప్రస్తావన లేదన్నారు.దశాబ్దాలుగా ఎంఎస్ఎంఇ ల అభివృద్ధి బోర్డులకు పరిమితం అవుతుంది తప్ప జిల్లా వెనుకబాటు తనాన్ని గుర్తించిన కేంద్రం ఆ దామాషాలో నిధులు కేటాయించలేదని దుయ్యబట్టారు. జిల్లా సమగ్రాభివృద్ధి కి రూ.10,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# టీ20 ప్రపంచ కప్‌నకు దూరం.. బంగ్లాదేశ్‌లో కొత్త టోర్నమెంట్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ 2026 (T20 World Cup)కు దూరమైన బంగ్లాదేశ్ తమ దేశ ఆటగాళ్ల కోసం కొత్త టీ20 టోర్నమెంట్‌ను ప్రారంభించనుంది. దీనికి ఓడోమ్మో బంగ్లాదేశ్ ౹20 కప్ 2026 (ODOMMO Bangladesh T20 Cup) అని పేరు పెట్టింది. 'ఓడోమ్మో' అంటే బంగ్లాలో అజేయమైన లేదా ఎవరికీ లొంగనిది అని అర్థం. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ఈ టోర్నీ జరగనుంది. మూడు జట్లు పోటీపడతాయి. ధూమ్‌కేతు ॥× జట్టుకు లిటన్ దాస్, దర్బార్ XI టీమ్‌కు నజ్ముల్ హుస్సేన్ శాంటో, దురంటో ॥× జట్టుకు అక్బర్ అలీ నాయకత్వం వహించనున్నారు. ప్రైజ్‌మనీ, ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులకు రూ.1.87 కోట్లు ఖర్చు చేస్తామని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధికారి తెలిపారు. మ్యాచ్‌లకు మరింత ఊపు తీసుకొచ్చేందుకు 'ఇంపాక్ట్ ప్లేయర్ రూల్'ను ఈ టోర్నీలో ప్రవేశపెట్టనున్నారు. ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో గ్రూప్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ నెల 9న ఫైనల్ నిర్వహిస్తారు. టీ20 ప్రపంచ కప్ 2026 ఈ నెల 7 నుంచి ప్రారంభంకానుంది. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. భారత్‌లో మ్యాచ్‌లు ఆడటానికి బంగ్లాదేశ్ నిరాకరించింది. దీంతో ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ప్రత్యామ్నాయ జట్టుగా ఆడించాలని ఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కొత్త టోర్నమెంట్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా అల్కరాస్..



**హైదరాబాద్ పెన్ పవర్:** పురుషుల టెన్నిస్‌లో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన అతిపిన్నవయస్కుడిగా ప్రపంచ నంబర్ వన్ అల్కరాస్ (స్పెయిన్) చరిత్ర సృష్టించాడు. ఆదివారం హోరాహోరీగా సాగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో నొవాక్ జకోవిచ్ (సెర్బియా)పై 2-6, 6-2, 6-3, 7-5 తేడాతో అల్కరాస్ విజయం సాధించాడు. 22 ఏళ్ల అల్కరాస్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఇది తొలి టైటిల్. అతను ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025), వింబుల్డన్ (2023, 2024), యూఎస్ ఓపెన్ (2022, 2025) టైటిళ్లు సాధించాడు. మరోవైపు.. జకోవిచ్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లో ఇది తొలి ఓటమి. అంతకుముందు ఈ టోర్నమెంట్‌లో ఫైనల్ చేరిన పదిసార్లూ అతడు విజేతగా నిలవడం విశేషం. టెన్నిస్ చరిత్రలో అత్యధిక (25) గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు సాధించాలనుకున్న జకోవిచ్ ఆశలపై అల్కరాస్ నీళ్లుచల్లాడు. ప్రస్తుతం 24 టైటిళ్లతో ఉన్న నొవాక్.. 25వ టైటిల్ కోసం చాలా కష్టపడుతున్నాడు. చివరగా 2023లో యూఎస్ ఓపెన్ గెలిచాక.. అతడు మళ్లీ గ్రాండ్‌స్లామ్ కొట్టలేకపోతున్నాడు.

# అండర్19 వరల్డ్ కప్: పాక్‌తో ఇండియా ఢీ

**సెమీఫైనల్ బెర్తుపై టీమిండియా గురి**

**మధ్యాహ్నం1 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో**




**హైదరాబాద్ పెన్ పవర్:** అండర్19 వరల్డ్ కప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న యంగ్ ఇండియా.. హై ఓల్టేజ్ పోరుకు రెడీ అయింది. ఆదివారం జరిగే సూపర్6 ఆఖరి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఇందులో గెలిచి సెమీఫైనల్‌కు చేరుకోవడంతో పాటు ఆసియా కప్ ఫైనల్లో పాక్ చేతిలో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని కుర్రాళ్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ వరల్డ్ కప్‌లో ఇండియా కుర్రాళ్ల ఆధిపత్యమే ఎక్కువగా కనిపించింది. గ్రూప్ దశలో బంగ్లాదేశ్, న్యూజిలాండ్, అమెరికాపై గెలిచారు. సూపర్6 తొలి మ్యాచ్‌లోనూ జింబాబ్వేను ఓడించి మంచి ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. దాంతో పాక్‌తో మ్యాచ్‌లోనూ టీమిండియానే ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. వైభవ్ సూర్యవంశీ (166 రన్స్), అభిగ్యాన్ కుండు (183), విహాన్ మల్హోత్రా (151) ఫామ్‌లో ఉండటం కలిసొచ్చే అంశం. వీళ్లకు తోడు కెప్టెన్ ఆయుష్ మాత్రే, ఆరోన్ జార్జ్ బ్యాట్ ఝుళిపిస్తే భారీ స్కోరు ఖాయం. బౌలింగ్‌లో పేసర్ హెనిల్ పటేల్, ఉదవ్ మోహన్, ఆర్.ఎస్ అంబరీష్‌పైనే ఎక్కువగా భారం ఉంది. వీళ్లందరూ సమష్టిగా చెలరేగితే ఇండియా విజయాన్ని అడ్డుకోవడం కష్టమే. మరోవైపు పాకిస్తాన్‌ను కూడా తక్కువగా అంచనా వేయలేం. సూపర్6 తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై గెలిచి మంచి జోరు మీదుంది. ఆసియా కప్ ఫైనల్లో 172 రన్స్ చేసిన ఓపెనర్ సమీర్ మిన్హాస్ మంచి ఫామ్‌లో ఉండటం పాక్‌కు కలిసొచ్చే అంశం.



**సిట్రస్ & రోజెస్ రిట్రీట్: మిషా నారంగ్ ట్రాంక్విల్ మూమెంట్**

# ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆ ముగ్గురు



అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, చిరంజీవి వంటి దిగ్గజాలు కేవలం వెండితెరపైనే కాదు.. నిజ జీవితంలో కూడా తమ సింప్లిసిటీతో కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

సూపర్ స్టార్ రజనీకాంత్ సింప్లిసిటీ వెనుక రహస్యం పరిశీలిస్తే.., రజనీకాంత్ హిమాలయాల యాత్రలు, మహావతార్ బాబాజీ బోధనలు వినేందుకు ఇష్టపడతారు. ఆయనకు షూటింగ్ లేకపోతే కేవలం సాధారణ పంచె, లుంగీలోనే కనిపిస్తారు. బిగ్ బి అమితాబ్ బచ్చన్ తన తండ్రి హరివంశ్ రాయ్ బచ్చన్ నుంచి సాహిత్యం, క్రమశిక్షణ అవవరుచుకున్నారు. ఈ వయసులో కూడా ఆయన సెట్స్‌లో అందరికంటే ముందు ఉండి అందరినీ గౌరవిస్తారు. అంతేకాదు యువకుల కంటే ఎక్కువ ఉత్సాహంగా ఈ వయసులోను నటిస్తున్నారు.మెగాస్టార్ చిరంజీవి మొదటి నుంచి హనుమంతుడి భక్తుడు. సామాన్య కుటుంబం నుండి గ్లామర్ ప్రపంచంలోకి వచ్చి మెగాస్టార్‌గా ఎదిగేందుకు ఎంతో శ్రమించారు. ఒదిగి ఉండే స్వభావం ఆయన ప్రత్యేకత. పై ముగ్గురూ కొత్త వారితో కూడా ఎంతో ఆప్యాయంగా మాట్లాడే నైజం ఉన్నవారు. లగ్జరీ కంటే సాధారణ ఆధ్యాత్మిక జీవితం గడిపేందుకు ఎప్పుడూ ఆసక్తిగా ఉంటారు.

**అహంకారం వీడితేనే అసలైన సుఖం**

నిజానికి ఏ మనిషి అయినా అహంకారం వీడితేనే సుఖం. ఎంత సింపుల్‌గా జీవిస్తే అంత మేలు! అనేది అక్షర సత్యం. ఈ స్టార్లందరూ తమలోని -అహాన్ని- పక్కన పెట్టారు కాబట్టే వేల కోట్ల ఆస్తి ఉన్నా సామాన్యుడిలా జీవించేందుకు వెనకాడరు. ఆధ్యాత్మికత అంటే కేవలం పూజలు చేయడం మాత్రమే కాదు.. ఎదుటి మనిషిని గౌరవించడం తన మూలాలను మర్చిపోకపోవడం అని వీరు నిరూపిస్తున్నారు.

సూపర్ స్టార్ రజనీకాంత్ సింప్లిసిటీ గురించి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అరవింద్ స్వామి చెప్పిన ఈ సంఘటన ఎంతో ఆశ్చర్యం కలిగించింది. తళపతి (1991) షూటింగ్ సమయంలో సెట్లో ఒక బెడ్ పై అరవింద్ స్వామి ఆదమరిచి నిద్ర పోయారు. అయితే అది రజనీకి కేటాయించిన బెడ్ అనే విషయం అతడికి తెలియదట. అయితే ఆ సమయంలో అక్కడికి వచ్చిన రజనీకాంత్ ఆ దృశ్యం చూసారు. అయితే అతడిని నిద్రలేపి డిస్టర్బ్ చేయలేదు. ఎవరో కొత్త కుర్రాడు.. పాపం అలసిపోయి నిదురపోతున్నాడు.. అని తను చాప తీసుకుని నేలపైనే నిదురించారట. అయితే కాసేపటికి నిదుర లేచి చూశాక అరవింద స్వామి షాక్ అయ్యారట. ఈ విషయాన్ని ఇప్పుడు అతడు గుర్తుచేసుకున్నారు.



**మాళవిక మోహనన్ జాయ్‌ఫుల్ గ్లో: గుడ్ హెయిర్ డే వైబ్స్**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com